


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 156 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 17 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 156 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 17 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరుంది

- అవినీతి మంత్రిపై రేవంత్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న మోత్కుపల్లి
- సీఎం ఒక్కడే కష్టపడితే సరిపోదని వ్యాఖ్య
- రేవంత్ ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్న మోత్కుపల్లి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన మంత్రివర్గంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహు లు తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. వ్యవస్థలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో ముఖ్యమంత్రి లేరని ఆయన విమర్శించారు .రాష్ట్రంలో ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరు ముద్ర పడిపోయిందని, ఏ మూలకెళ్లి అడిగినా జనం ఆయన పేరే చెబుతున్నారని మోత్కుపల్లి ఆరోపించారు.

మిగతా 2లో

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...

### భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

మిగతా 2లో





# లోక్‌సభలో.. గరం గరం!


### మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- మెజార్టీ సభ్యుల మద్దతుతో చర్చకు ఆమోదం
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- దీనిపై నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- బిల్లు ఆమోదానికి తొందరెందుకన్న అఖిలేష్ యాదవ్
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- ఎప్పుడో ఆమోదం పొందిన బిల్లుపై మళ్లీ చర్చా.. ప్రధాని మోదీని నిలదీసిన ఎంపీ కేసీ వేణుగోపాల్
- ఘాటుగా కౌంటర్ ఇచ్చిన హోమ్ మంత్రి అమిత్ షా

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై చర్చించేందుకు లోక్సభ లాంఛనంగా ఆమోదం తెలి పింది. మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజన తదితర అంశా లతో కూడిన ఈ బిల్లులపై సభలో సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరపను న్నారు.కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసు కువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులకు ఈ చర్చల జాబితాలో చోటు దక్కింది. ఈ బిల్లులపై విపక్ష, అధికార పక్ష సభ్యుల వాడివేడి చర్చల అనంతరం (శు క్రవారం) సాయంత్రం సరిగ్గా 4 గంటలకు మూడు బిల్లులపైన ఓటింగ్ నిర్వహి చనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారి కంగా ప్రకటించారు.

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరఫున

మిగతా 2లో




## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

### నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

మిగతా 2లో



## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- రిలయన్స్ కమ్యూనికేషన్స్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించిన బ్యాంకులు
- మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు అనుమతించిన బాంబే హైకోర్టు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన అనిల్ అంబానీ

**పెన్ పవర్ డెస్క్:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూ రితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

మిగతా 2లో

## మూసీ పునరుజ్జీవనానికి ప్రజల జై..

### 70 గ్రామాలకు రూ.వెయ్యి కోట్లు కోరిన ప్రజాసంఘాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** 'మూడు దశాబ్దాలుగా మూసీ నది నీరు విషపూరితం కావడంవల్ల మా బతుకులు ధ్వంసమయ్యాయి. జంటనగరాల లోంచి వచ్చే డ్రెయినేజీ నీటితో పాటు, పరిశ్రమల నుంచి వచ్చే రసాయనాలు వ్యర్థాలతో కూడిన నీరు మా జీవితాలను, మా పశువులను, మా గొర్రెలు, మా మత్స్య సంపద, మా పంటను, మా తాటి, ఈత కల్లును, మా సర్వస్వాన్ని నాశనం చేశాయి. రెండు దశాబ్దాలలో దాదాపు వంద మందికి పైగా స్త్రీలకు గర్భవిచ్ఛిన్నం జరిగింది. పశువులు కూడా సరిగా సంతానం ఉత్పత్తి చేయలేకపోయాయి. శిశువులకు స్నానం చేయించడానికి ప్రైవేట్ ఆర్‌ఓ ప్లాంట్ నుండి, నీటిని ఖరీదు చేసి వాడుతున్న దుస్థితి నెలకొని ఉంది. అయితే మూసీ నదిలోని కాలుష్యాన్ని అంతా శుద్ధి చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం మా గ్రాములకు శుద్ధి చేసిన నీరు నది ద్వారా అందించేందుకు సన్నాహాలు చేస్తుందని తెలిసి మేమంతా చాలా సంతోషిస్తూ, ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం' అని మూసీ పరివాహక గ్రామాల ప్రజలు పేర్కొన్నారు.

మిగతా 2లో



## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- రానున్న రెండు రోజుల్లో పలు జిల్లాల్లో మరింత పెరగనున్న ఎండలు
- మేడ్చల్, హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బయటకు వెళ్లొద్దంటున్న వైద్య నిపుణులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో భానుడు భగభగలాడుతున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో

మిగతా 2లో


## తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై

మిగతా 2లో



## అనర్హత పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయండి..

### స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్ సహా 9 మంది

మిగతా 2లో



## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి

మిగతా 2లో



## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

- డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య
- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ
- ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటిష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ

మిగతా 2లో




## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు.

## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.

ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది.దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఈ క్రమంలో అనిల్ అంబానీ డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, చుక్కెదురైంది.

## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్‌వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు. ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరుంది

- మొదటి పేజి తరువాయి

ఇంత బహిరంగంగా అవినీతి జరుగుతున్నా, సదరు మంత్రిపై చర్యలు తీసుకోవడానికి రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైనా సరే అవినీతిపరుడిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒక్కడే కష్టపడితే సరిపోదని అన్నారు. సీఎం వెనుక ఉండి గోతులు తవ్వే 'నల్లికుట్లోళ్లు' ఎవరో రేవంత్‌కు తెలియదా? అని నిలదీశారు. ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, సొంత పార్టీలోనే కుట్రలు జరుగుతున్నా సీఎం మౌనంగా ఉండటం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత కూడా, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు సమావేశాలు పెడుతున్నా ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. కేవలం ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ప్రజలు వెంట ఉండాలంటే ముందు అవినీతికి అంతం పలకాలని హితవు పలికారు.

## మూసీ పునరుజ్జీవనానికి ప్రజల జై..
### 70 గ్రామాలకు రూ.వెయ్యి కోట్లు కోరిన ప్రజాసంఘాలు

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు మూసీ పునరుజ్జీవం మంత్రుల సబ్ కమిటీకి మూసీ పరిరక్షణ సమితి, మూసీ పరివాహక గ్రామాల సమాఖ్య ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. సబ్ కమిటికి ఆన్ లైన్ ద్వారా వినతి పత్రం పంపించిన వారిలో మానవ హక్కుల వేదిక నాయకులు జీవన్ కుమార్ మూసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బట్టె శంకర్, గౌడ సంఘం నాయకులు బాలరాజ్ గౌడ్, యాదవ సంఘం నాయకులు చిలువేరి ఐలయ్య, శాలివాహన సంఘం నాయకులు గుండోళ్ళ లింగ స్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమోని బస్వ య్య, ఎంఆర్పీఎస్ నాయకులు సిరిపని ఐలయ్య, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మల్యాల బాలయ్య తదితరులు ఉన్నారు.

అందులోని ముఖ్య అంశాలు

మూసీ ప్రాజెక్టు పై అభిప్రాయాలు స్వీకరించే మంత్రుల కమిటీ మా గ్రామాలు పర్యటించి, మా అభి ప్రాయాలు స్వీకరించాలి.

ఈ ప్రాజెక్ట్ లో పరివాహక గ్రామాల ప్రజలను కూడా భాగస్వాములను చేయాలి.

గౌరెల్లి గ్రామం వరకే ప్రకటించిన ప్రాజెక్టును, సోలిపేట గ్రామం, కేతేపల్లి మండలం, సూర్యపేట జిల్లా వరకు పొడిగించాలి.

మూసీ దిగువన ఉన్న దాదాపు 70 గ్రామాలకు రూ.1000 కోట్లు కేటాయించాలి. ఈ వెయ్యి కోట్లు మూడు దశాబ్దాలుగా మా గ్రామ ప్రజల జీవితాలు విధ్వంసం అయినందుకు, మా సంక్షేమం కోసం ఖర్చు పెట్టడం కోసమే.

అన్ని గ్రామాల్లో =ా ప్లాంట్స్ ఏర్పాటు చేసి వాటిని గ్రామపంచాయితీల అజమాయిషీలో ఉంచాలి.

ఏదులాబాద్ చెరువులో 2 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. దాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేయాలి.

## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- మొదటి పేజి తరువాయి

గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో వాతావరణ శాఖ అత్యంత కీలకమైన హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీల వరకు పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉంది. ఆరెంజ్ హెచ్చరికలు ఉన్న జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలపాగా, గొడుగు వంటివి వినియోగించాలని, డీహైడ్రేషన్ కాకుండా తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలని హితవు పలుకుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎండల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- మొదటి పేజి తరువాయి

మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డీఎన్‌ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

## అనర్హత పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయండి..

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యేలను హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, సంజయ్, తెల్లం వెంకట్రావుతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణ మే 6వ తేదీకి వాయిదా వేసింది.

**హైకోర్టుకు బీఆర్ఎస్:**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, డా. సంజయ్ , దానం, కడియం ఆ తరువాత కాంగ్రెస్ గూటికి చేరారని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపిస్తూ వీరి పై వేటు వేయాలని సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పీకర్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన స్పీకర్ వీరంతా పార్టీ మారడానికి సరైన ఆధారాలు లేవంటూ ఈ పదిమందికి క్లిన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇందులో గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్ తో సన్నిహితంగా ఉంటున్న నేపథ్యంలో ఆయన పేరును తమ పిటిషన్ లో పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో ఇవాళ విచారణ జరిపిన హైకోర్టు గూడెం మినహా మిగతా 9 మంది ఎమ్మెల్యేలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది. మరి ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి.

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000... భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు.ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ?2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు.మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు.

ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు.

రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు.ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశు ద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్-ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది.బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

# లోక్‌సభలో.. గరం గరం!

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ**

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును మజ్లిస్ పార్టీ వ్యతిరేకించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సభలో వివిధ పార్టీలు డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు.

ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు.

డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్




నర్సాపూర్ రహదారిపై కూల్చేసి అక్రమ నిర్మాణం.. మళ్ళీ పూర్తి..

2026 మార్చి 26న టౌన్‌ప్లానింగ్ చర్యలు..

అదే అక్రమ నిర్మాణాన్ని, 2026 జనవరి 28న ఏసిపి ఆధ్వర్యంలో సీజ్..

# అక్రమ 'షెడ్ల'కోలెక్క..? అదనపు 'అంతస్తుల' కోలెక్క..?

## కూల్చేసినవి మళ్ళీ నిర్మించుకోవడానికీ 'మరో'లెక్క..?

- "టిజి-బిపాస్-బిల్డ్‌నవ్" చట్టాలను తనకా పెడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు..?
- దుండిగల్ సర్కిల్‌లో హద్దుమీరుతున్న అక్రమ నిర్మాణాల దందా..?
- ప్రశ్నించిన పై అధికారులకోలెక్కన ముడుపుల చెల్లింపులట..?
- కూల్చేసిన"అక్రమ షెడ్లు-భవన నిర్మాణాలు" మళ్ళీ నిర్మించుకోవడానికి వాటికోలెక్క..?
- నిర్మాణ చట్టాలను తనఖా పెడుతున్నారా..? అధికారులే అమ్ముడు పోతున్నారా..?
- టౌన్‌ప్లానింగ్ "అధికారులు- చైన్‌మెన్‌ల" బరితెగింపుపై ప్రజలు ఆగ్రహం..!
- పాత నిర్మాణాలపై..! కొత్త అక్రమ కట్టడాలకు సెటిల్మెంట్‌లు..! ప్రమాదాలు సంభవిస్తే..?
- నోటీసులు-సీజింగ్‌లు- కూల్చివేతలతో..! కొత్తరకం దందా షురూ..!
- 'సిఎంసి'లో విలీనమయ్యాక.. అక్రమ కట్టడాల దందా మరింత రెట్టింపు..?

తెలంగాణ ప్రభుత్వం ఓవైపు పరిపాలనా సౌలభ్యం,నగరాభివృద్ధి కోసం హైదరాబాద్ మహానగరాన్ని విస్తరింపజేస్తుంటే..! కొందరు అధికారపార్టీ నాయకులకు, అవినీతి అధికారులు తోడై, అభివృద్ధికి అడ్డంకిగా మారారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి. అధికారమనే ముసుగేసుకొని కొందరు నాయకులు, ఎవరి పరిధిలో వాళ్ళు వివిధ శాఖల అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.. కొందరు అధికారులు బరించలేక లాంగ్ లీవ్ పెడుతున్నారని, అనధికారిక సమాచారం.. ప్రభుత్వ నిషేధిత భూముల్లో అక్రమ నిర్మాణాలైనా..! అక్రమ షెడ్లైనా..! మున్సిపల్ అనుమతులతో నిర్మించే.. అక్రమ కట్టడాలైనా సరే..! టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో వసూళ్ళ పర్వం పతాక స్థాయికి చేరుకుందని స్థానికులు చర్చించు కుంటున్నారు.. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన నిధులు.. నేతలు, అధికారుల జేబుల్లోకి చేరుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 16:**



అక్రమ షెడ్డుపై అధికారుల మొక్కుబడి చర్యల ఫొటోషూట్.. దృశ్యం..



బహుదూర్‌పల్లిలో టౌన్‌ప్లానింగ్ కూల్చేసిన 1500 గజాల షెడ్డు ఇదేనట.. చెక్కుచెదరని చర్యలు..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

### సీఎం కంటే ముందే మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం..

# ఆసక్తిగా మారిన సందర్శన



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకంగా భావించే మేడిగడ్డ బ్యారేజీ చుట్టూ రాజకీయ హీట్ పెరిగింది. ఈ నెల 18న బీఆర్ఎస్ బృందం మేడిగడ్డకు వెళ్లి పరిస్థితులను పరిశీలించనుండగా.. 20న ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో ఈ సందర్శనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా వీరు సందర్శించనున్నారు. ఇటీవల ఈ మూడు బ్యారేజీల పరిస్థితిపై వస్తున్న వార్తలు, సాంకేతిక అంశాలపై నెలకొన్న సందేహాల నేపథ్యంలో ప్రాజెక్టు స్థితిగతులను స్వయంగా పరిశీలించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశాలపై బీఆర్ఎస్ నేతలు అధికారులను ప్రశ్నించే అవకాశమున్నదని సమాచారం. ఇదే సమయంలో ఈ నెల 20న సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డకు వెళ్తున్నారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను స్వయంగా పరిశీలించి..

-4లో

# తేజస్వి సూర్య వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారు

- బీజేపీ మద్దతు వల్లే తెలంగాణ ఏర్పడిందన్న రాంచందర్ రావు
- విభజన సమయంలో అశాస్త్రీయ పరిణామాలను తేజస్వి సూర్య ప్రస్తావించి ఉండవచ్చని వ్యాఖ్య
- ఆ సమయంలో బీఆర్ఎస్‌కు ఇద్దరు సభ్యులు కూడా లేరని ఎద్దేవా



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు కావాలనే రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు మండిపడ్డారు. తేజస్వి సూర్య ఉద్దేశం తెలంగాణను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. విభజన సమయంలో చోటుచేసుకున్న అశాస్త్రీయ పరిణామాలను ప్రస్తావించి ఉండవచ్చని, దానిని బీఆర్ఎస్ నేతలు తమకు అనుకూలంగా

-4లో


# అక్రమ 'షెడ్ల'కోలెక్క..? అదనపు 'అంతస్తుల' కోలెక్క..?



బహుదూర్‌పల్లి టెక్ మహీంద్రా ఎదురుగా, అక్రమ భారీ నిర్మాణం.. నిబంధనలకు తిలోదకాలు..



మల్లంపేట్‌లో పాఠశాల పాత భవనంపై కొత్తగా అక్రమ నిర్మాణం..




మల్లంపేట్ కేవిఆర్ వ్యాలీలో పాత కట్టడంపై కొత్తగా అదనపు అంతస్తులు.. అక్రమమే..

**దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గత నాలుగు నెలలుగా, చైన్‌మెన్‌ల తొలగింపు..నూతనంగా 5గురు ఒకరు పత చైన్‌మెన్‌తో పాటు మొత్తం 6 గురు చైన్‌మెన్‌ల నియామకం.. ఇదంతా 'తెరముందు ఒకరు-తెరవెనుకొకరు' అన్నట్టు తయారైందట.. బయటికి చూడటానికి తెరముందు 6 గురు చైన్‌మెన్‌లు ఉన్నప్పటికీ..! తెరవెనుక అసలు సూత్రదారులు, ఆ ముగ్గురు చైన్‌మెన్‌లే ఆర్థిక లావాదేవీలు చూస్తున్నట్టు సమాచారం..? ఈ విషయాన్ని, ఓ కొత్త చైన్‌మెన్ తన మనసులోని మాటను, తన పైఅధికారితో ప్రస్తావించినట్టు, వినికిడి.. తాము ఫీల్డ్‌లో తిరిగినా, బిల్డర్‌లతో పాత చైన్‌మెన్‌లే టచ్‌లో ఉంటున్నారని, తాము ఎందుకు అన్నట్టు ప్రశ్నించాడని సమాచారం.. నిజానికి అధికారికంగా నియమించిన 6 గురు చైన్‌మెన్‌లు, ఒక్కసారిగా తెలియని విధులతో అధికారుల టార్గెట్ పూర్తి చేయగలరా..? అక్రమ కట్టడాలపై బిల్డర్‌లతో సుదీర్ఘకాలం పరిచయం ఉన్న ఆ ముగ్గురు లేకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..**

## 1500 గజాల షెడ్డు కూడా కూల్చినదే.. ఇప్పడోసారి చూడండి..!

దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధి బహుదూర్ పల్లిలోని 1500 గజాల భారీ అక్రమ షెడ్డుపై, ప్రారంభ దశనుండే "డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసిపి, టిపిఎస్"లతో పర్మిషన్‌పై ప్రశ్నించినా సమాధానం లేదు.. 'పెన్ పవర్' దినపత్రికలో వరుస కథనాలు వచ్చినా, అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు 'దున్నపోతు మీద వర్షం పడిన' చందంగా మౌనంగా వ్యవహరించి, పట్టించుకోలేదు.. చివరికి 2026 మార్చి 26న టౌన్‌ప్లానింగ్ అధికారి "అసిస్టెంట్ సిటీ ప్లానర్" ఆద్వర్యంలో తూతూ మంత్రంగా షెడ్డు చివరిలో 2 రేకులు తొలగించి 'ఫొటోషూట్' చర్యలతో మమః అనిపించారు.. చర్యల అనంతరం కూడా, చెక్కుచెదరని అక్రమ షెడ్డును, బహుదూర్‌పల్లిలో, నర్సాపూర్ రహదారి పక్కన చూస్తే దర్శనమిస్తుంది.. ఇదంతా అధికారులు, అక్రమార్కుల ఒప్పందంలో భాగమేనని పలువురు ఆరోపిస్తున్నారు..

- 3 పేజి తరువాయి
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 ప్రభుత్వ కార్యాలయమా..? ప్రైవేటు సంస్థనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ కాంప్లెక్స్‌లు..! పర్మిషన్‌లు తీసుకోవాల్సిన భారీ షెడ్లను కూడా అక్రమంగా నిర్మించుకోవడానికి సెటిల్మెంట్‌లు..? ఇదంతా బహిరంగమే, చట్టపరంగా "నోటీసులు-సీజింగ్‌లు" ఆతర్వాత కూల్చివేతలు.. చివరికి చర్యలు తీసుకున్న అక్రమ నిర్మాణాలు సైతం, మళ్ళీ నిర్మించుకోవడం.. ఇదంతా టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. దుండిగల్ సర్కిల్-59లో రెండు నెలల క్రితం జరిగిన, ఏసిబి దాడుల వెనుక, టిపిఎస్ సంజునాను టార్గెట్ చేయడంలోనూ, ఓ ముఖ్య అధికారికి దగ్గరగా ఉన్న అధికారపార్టీ నాయకుని హస్తం ఉందని, సర్కిల్‌లో కింది స్థాయి సిబ్బంది గుసగుసలాడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.. ఈ దాడుల అనంతరం అవినీతి మరింత రెట్టింపు అయిందనే విమర్శలూ లేకపోలేదు.. "తిలాపాపం తలాపిడికెడు" అన్న చందంగా, టౌన్‌ప్లానింగ్ వసూళ్ళ దందాకు చెక్ పెట్టలేక పోతున్నారని, స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు..

## కూల్చేసినవి మళ్ళీ ఎలా నిర్మించారు..?

దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రమాదకర అక్రమ నిర్మాణాలతో ప్రజలను ప్రమాదంలో పెడుతున్నారు.. చర్యల పేరిట కూల్చేస్తూ.. వెంటనే కట్టుకోవడానికి అనుమతించడంపై స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. నర్సాపూర్ రహదారిపై తాజా హోటల్ సమీపంలో "స్టిల్ట్2" అనుమతులతో అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకులు జీరో.. నిజానికి సెల్లార్ దశలోనే ఈ నిర్మాణం సీజ్ చేయాలి.. ఆతర్వాత అదనపు అంతస్తుల నిర్మాణ సమయంలో అయినా, సీజ్‌చేసి కూల్చేయాలి.. కానీ అదేమి జరగలేదు.. కొందరు అవినీతి అధికరులు ఒక్కటై అక్రమ నిర్మాణ దారునికి నిర్మాణం పూర్తయ్యే వరకు సహకరించారు.. చివరికి 2026 జనవరి 28న సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, పనులు యధావిధిగా చేసుకునే వెసులుబాటు కల్పించారు.. మళ్ళీ ఫిర్యాదులు, పత్రికల్లో వార్తలు వచ్చిన వెంటనే, పోరు పడలేక, సమాధానం చెప్పలేక, 2026 మార్చి 26న, ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతల డ్రామాతో రక్తి కట్టించారు.. ఇంతవరకు బాగానే మేనేజ్ చేశారు.. కానీ తరువాత ఎదురైన పరిణామాలు అధికారులు-అక్రమార్కులు ఊహించలేదు కాబోలు.. మార్చి 26న కూల్చినవి, వెంటనే పనులు ప్రారంభించి మళ్ళీ నిర్మించుకోవడం గమనార్హం..

## తేజస్వి సూర్య వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారు

- 3 పేజి తరువాయి
మలుచుకుంటూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.
పార్లమెంట్‌లో నాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ సంపూర్ణ మద్దతు ఇవ్వబట్టే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని... బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో లోక్‌సభలో బీఆర్ఎస్‌కు (నాడు టీఆర్ఎస్) కనీసం ఇద్దరు సభ్యులు కూడా లేరని, కేవలం తమ పార్టీ మద్దతుతోనే బిల్లు పాస్ అయిందన్న నిజాన్ని గ్రహించాలని గుర్తు చేశారు.రాష్ట్రం ఇచ్చామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఎన్నోసార్లు యూటర్న్‌లు తీసుకుందని, ఆ పార్టీ ద్వంద్వ వైఖరి వల్లే ఉద్యమం సుదీర్ఘకాలం సాగిందని రాంచందరర్ రావు ఆరోపించారు.

## సీఎం కంటే ముందే మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం.. ఆసక్తిగా మారిన సందర్శన

- 3 పేజి తరువాయి
పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రాజెక్టు భద్రత, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై వివిధ ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. బీఆర్ఎస్ నేతలు, సీఎం పర్యటనలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ బృందం ముందస్తు సందర్శనపై రాష్ట్ర రాజకీయాల్లో చర్చ జరుగుతున్నది. సీఎం పర్యటనకు ముందే అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి పూర్తిస్థాయిలో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

# మెట్రోతో మినీ ఎలక్ట్రిక్ బస్సుల లింక్

**హైదరాబాద్, ఏప్రిల్ 16, పెన్ పవర్:)**
హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా మెట్రో స్టేషన్ల నుంచి మినీ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా.. త్వరలోనే మినీ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఎలక్ట్రిక్ బస్సులే నడుస్తుండగా.. వాటిని ఛార్జ్ చేసేందుకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆర్టీసీ రెడీ అయింది. హైదరాబాద్ మెట్రో ప్రతి నిత్యం దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది. నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకోవాలంటే చాలా మంది మెట్రో ట్రైన్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ మెట్రో సేవలు నగర వ్యాప్తంగా లేకపోవటంతో చాలా మంది మెట్రో దిగిన తర్వాత తమ తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. అయితే చాలా వరకు మెట్రో స్టేషన్ల సమీపంలో బస్టాండ్లు అందుబాటులో ఉండటం లేదు. చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు ఫీడర్ సర్వీసులుగా మినీ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఈ మినీ ఎలక్ట్రిక్ బస్సులను సమీప కాలనీలకు నడపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రధాన టెర్మినల్ పాయింట్లు అయిన పటాన్‌చెరు, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, వనస్థలిపురం, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కాలనీ, చిలకలగూడ, బాలానగర్, మెహిదీపట్నం, గండిమైసమ్మ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్‌స్టేషన్లు అవసరమని తాజాగా ఆర్టీసీ అదికారులు గుర్తించారు. ఇందుకు 1500 నుంచి 2500 చదరపు మీటర్ల చొప్పున భూమి కావాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. సూచించిన ఆయా ప్రాంతాల్లోని భూములను గుర్తించి జాబితా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆర్టీసీ యాజమాన్యం కోరింది. ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సమయంలో లేదా టెర్మినల్ వద్ద ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్లు 10 నుంచి 20 నిమిషాలు పాక్షికంగా బ్యాటరీని ఛార్జ్ చేస్తాయి. దీనినే అపర్చునిటీ ఛార్జింగ్ అని అంటారు. బస్సు రూట్ చివరి పాయింట్ లేదా మధ్యలోని ప్రధాన స్టాప్‌ల వద్ద వీటిని అందుబాటులోకి తీసుకొస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే 300 నుంచి 600 కిలోవాట్ హై పవర్ ఛార్జర్లు ఎలక్ట్రిక్ బస్సులను త్వరగా ఛార్జ్ చేయనున్నాయి. వీటితో పాటు అన్ని బస్సులు ఒకేసారి రాత్రి డిపోలో ఛార్జ్ చేస్తే విద్యుత్ గ్రిడ్‌పై భారం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ కేంద్రాలతో ఆ ఇబ్బంది తొలిగిపోనుంది. ఆర్టీసీ బస్సు డిపోకు తిరిగొచ్చిన తర్వాత పూర్తిగా ఛార్జ్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. టెర్మినల్‌లో 10 నుంచి 15 నిమిషాల లేఓవర్‌లోనే టాప్‌అప్ చేసుకొని మళ్లీ ఆయా రూట్‌లోకి వెళ్లొచ్చు. దీని వల్ల బస్సులను ఎక్కువ ట్రిప్పులు తిప్పటానికి అవకాశం ఉండటంతో పాటు సుదూర మార్గాల్లో ప్రయాణ సేవలు అందించొచ్చు.

# త్రిపుల్ ధమాకా.. ఒకేసారి మూడు నెలల కోటా

**నల్గొండ, ఏప్రిల్ 16, పెన్ పవర్:** తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ నెలకు సంబంధించి రేషన్ పంపిణీ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించింది. సాధారణంగా నెల మధ్యలోనే ముగిసే పంపిణీ గడువును, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నెలాఖరు వరకు పెంచుతూ పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందవేసవిలో ఎండల తీవ్రత పెరగడం, రాబోయే నెలల్లో వడగాల్పుల ముప్పు ఉండటంతో లబ్ధిదారులు ప్రతి నెలా షాపుల వద్ద క్యూ కట్టకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఇందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కోటాను మొత్తం 18 కేజీల సన్నబియ్యం - నెలకు 6 కేజీల చొప్పున ఈ నెలలోనే ఒకేసారి పంపిణీ చేస్తోంది. దీనివల్ల లబ్ధిదారులు మే, జూన్ నెలల్లో ఎండలో ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. మూడు నెలల సరుకులు ఒకేసారి ఇస్తుండటంతో, ఇప్పుడు తీసుకోకపోతే మళ్ళీ దొరకవేమోనన్న ఆందోళనతో లబ్ధిదారులు భారీగా రేషన్ షాపులకు తరలివస్తున్నారు. దీనివల్ల సర్వర్లపై ఒత్తిడి పెరిగి ఈ-పోస్ (వ-ాశీా) యంత్రాలు మొరాయిస్తున్నాయి. ఈ రద్దీని గమనించిన ప్రభుత్వం, లబ్ధిదారులు కంగారు పడాల్సిన పనిలేదని, ఈ నెల 30 వరకు ఎప్పుడైనా సరుకులు తీసుకోవచ్చని స్పష్టం చేసిందిఈ భారీ పంపిణీ వెనుక మరో వ్యూహాత్మక కారణం కూడా ఉంది. కొత్త సీజన్ ధాన్యం సేకరణ ప్రారంభమవుతున్న తరుణంలో, గోదాముల్లో ఉన్న పాత నిల్వలను ఖాళీ చేసి కొత్త ధాన్యానికి చోటు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరుకుల నిర్వహణను సులభతరం చేయడానికి ఈ అడ్వాన్స్ పంపిణీ ప్రక్రియను చేపట్టింది.మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ధృవీకరణతోనే మూడు నెలల సరుకులు పొందవచ్చు. గడువు నెలాఖరు వరకు ఉన్నందున, ఉదయం

వేళల్లో కాకుండా రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో వెళ్లి సరుకులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈసారి కూడా నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోంది, కాబట్టి నిల్వ చేసుకున్నా పాడవుతాయన్న భయం అక్కర్లేదు. ప్రభుత్వం తీసుకున్న ఈ గడువు పొడిగింపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని సుమారు 1.05 కోట్ల రేషన్ కార్డుదారులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేదలకు మరియు వృద్ధులకు పెద్ద ఉపశమనం లభించనుంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హిందూ ధర్మం జీవన విధానం: కమలానంద భారతి స్వామిజీ



**కల్వకుర్తి, ఏప్రిల్ 16 పెన్ పవర్:** కల్వకుర్తిలోని గాంధీనగర్ సత్యసాయి మందిరంలో సాయంత్రం జరిగిన 'హిందూ సమ్మేళనం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూజ్య శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామిజీ, హిందూ ధర్మం కేవలం పూజలు, వ్రతాలు కాదని, అది ఒక జీవన విధానమని, 'సర్వే జనాః సుఖినోభవంతు' అని ప్రపంచ శాంతిని కాంక్షించిన ధర్మమని అన్నారు. నేడు ధర్మంపై దాడులు జరుగుతున్న తరుణంలో ఇలాంటి సమ్మేళనాలు అవసరమని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బృంగి అమరేందర్, కార్యదర్శి బోడ నరసింహ, బిజెపి నేత మొగిలి దుర్గాప్రసాద్, ఆర్.ఎస్.ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

## ప్రేమ పేరుతో మోసం.. యువకుడిపై కేసు

**వనపర్తి, ఏప్రిల్ 16 పెన్ పవర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో, ప్రేమ, పెళ్లి పేరుతో మహిళను మోసం చేసిన జుర్రు మహేశ్ పై కేసు నమోదైంది. 2021 సంవత్సరం నుంచి ఒక యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆ తర్వాత మరో యువతిని పెళ్లి చేసుకుని మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెబ్బేరు పోలీసులు మహేశ్ పై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లో పూర్తిస్థాయిలో వసతులు

**గద్వాల, ఏప్రిల్ 16 పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఆదేశించారు. గద్వాల మండలం కాకులారం గ్రామ జడ్పీహెచ్ఎస్ లో భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం ఉన్న 130 మంది విద్యార్థులతో పాటు భవిష్యత్తులో 1500 మంది విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణ అవసరమని సూచించారు.

## గద్వాల జిల్లాలో వడ్ల లారీ దగ్ధం.!

**ఆలంపూర్, ఏప్రిల్ 16 పెన్ పవర్:** జోగులంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఇటిక్యాల జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజి సమీపంలో గురువారం వడ్ల లారీలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తూనే, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## నో హెల్మెంట్.. నో ఎంట్రీ పోలీసుల విన్నూత్న ఆలోచన




**తుంగతుర్తి, ఏప్రిల్ 16 పెన్ పవర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, అరైవ్ అలైవ్ రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు నాగారం సబ్ ఇన్స్పెక్టర్ వినూత్న రీతిలో ఆలోచన చేశారు. ఫణిగిరి గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని సూచించారు.

## నాయకులకు కార్య కర్తలకు అండగా ఉంటా...

**సూర్యాపేట, ఏప్రిల్ 16 పెన్ పవర్:** సూర్యాపేట పట్టణం బాలాజీ నగర్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పున్న నరేందర్ కుమారుడు అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మొరిశెట్టి నివేదిత లక్షాది వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏలిమినేటి అభినయ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# త్వరలో సంస్థాగత పోస్టులు

**హైదరాబాద్, ఏప్రిల్ 16,పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.పార్టీలో అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.దీనితో పాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా వ్యూహరచన చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల అభిప్రాయాలను పార్టీ యంత్రాంగం సేకరించాలని చర్చించారు. పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కేడర్ నుంచి అందుతున్న ఫీడ్బ్యాక్ను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూసేందుకు క్రమం తప్పకుండా ఇటువంటి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో తీర్మానించారు.రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ ముక్కోణపు భేటీ తెలంగాణ కాంగ్రెస్లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు, పార్టీలోని అంతర్గత విభేదాలకు చెక్ పెట్టి.. రాబోయే ఎన్నికలకు క్యాడర్ను సమరోత్సాహంతో సిద్ధం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే లిస్ట్ సిద్ధమైందని, ఏ క్షణమైనా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

# కాంగ్రెస్ తో కలిసి రేవంత్ పనిచేస్తారా

**హైదరాబాద్, ఏప్రిల్ 16,పెన్ పవర్:**
కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులకు దారితీస్తోంది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరిదీ ఒకే విధానంగా కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్తో ముడిపెట్టడంపై కేటీఆర్ విరుచుకుపడుతుండగా, అటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దక్షిణాది హక్కుల కోసం గళం ఎత్తుతోంది.జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తెలంగాణ వంటి రాష్ట్రాలను సీట్ల పెంపు విషయంలో శిక్షించడం అన్యాయమని కేటీఆర్ అంటున్నారు. ప్రస్తుత పార్లమెంటులో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా ఏ మాత్రం తగ్గకూడదని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఇదే అంశంపై రేవంత్ రెడ్డి కూడా గతంలో ప్రధాని మోదీకి లేఖ రాస్తూ.. దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేలా విభజన ఉండకూడదని స్పష్టం చేశారు. విధానపరంగా ఇద్దరు నేతలు ఒకే తాటిపై ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని రాజకీయ సమీకరణాల దృష్ట్యా వీరు కలిసి పోరాడే అవకాశం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది.బిజెపి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శఇస్తున్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల ఎజెండాపై నమ్మకం లేదని మండిపడ్డారు. 50 శాతం సీట్ల పెంపుపై ఎక్కడా అధికారిక ప్రకటన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర



మంత్రి కిషన్ రెడ్డి సైతం తెలంగాణకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర హక్కుల కోసం తాము ఇతర పక్షాలతో కలిసి పోరాడుతామని చెబుతూనే, రేవంత్ రెడ్డిని బీజేపీ ప్రతినిధి గా ముద్ర వేయడం ద్వారా కాంగ్రెస్తో కలిసి నడిచే ప్రసక్తే లేదని పరోక్షంగా స్పష్టం చేశారు.మరోవైపు, కాంగ్రెస్ అధిష్టానం కూడా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి కావడంతో, వారితో చేతులు కలిపితే తమ రాజకీయ ఉనికి దెబ్బతింటుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే, ఇద్దరి లక్ష్యం దక్షిణాది ప్రయోజనాలు అయినప్పటికీ, ఆ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంలో నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు. ఇది కేవలం సిద్ధాంతాల పోరాటం కంటే పవర్ పాలిటిక్స్ గానే ఎక్కువగా కనిపిస్తోంది.డీలిమిటేషన్ అంశం తెలంగాణలో విచిత్రమైన పరిస్థితిని సృష్టించింది. ఒకే సమస్యపై అధికార, ప్రతిపక్షాలు ఒకే మాట మీద ఉన్నా.. గల్లీలో ఉన్న వైరం వల్ల ఢిల్లీలో గళం కలపలేకపోతున్నాయి. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, ఈ ఇద్దరు నేతలు విడివిడిగానే నిరసన గళాలు వినిపిస్తారా లేక రాష్ట్ర ప్రయోజనాల కోసం అనివార్యంగా ఒకే వేదికపైకి వస్తారా అన్నది వేచి చూడాలి. గతంలో తమిళనాడులో స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు నేతలు హాజరయ్యారు. ప్రస్తుతానికి మాత్రం ఈ కామన్ పాలసీ కేవలం ప్రకటనలకే పరిమితం కానుంది.

# మురుగు నీటికి ఫుల్ డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 16,పెన్ పవర్:**
వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం హైదరాబాద్ జలమండలి వినూత్న కార్యక్రమానికి రెడీ అయింది. గేటెడ్ కమ్యూనిటీల నుంచి శుద్ధి చేసిన మురుగునీటిని ఒక్కో ట్యాంకర్కు రూ.50-రూ.100 చెల్లించి సేకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఎరుపు రంగు' ట్యాంకర్లను కేటాయించింది. సేకరించిన నీటిని నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కుల నిర్వహణకు వాడడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు.సాధారణంగా ప్రజలు జలమండలి నుంచి నీటిని కొనుగోలు చేయడం మనకు తెలుసు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేసవి తాపం మట్టదలవుగా.. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో నీటికి డిమాండ్ పెరిగింది. భారీగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. గేటెడ్ కమ్యూనిటీలలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని జలమండలి తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించేందుకు బోర్డు రెడీ అయింది.హైదరాబాద్లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీలలో రోజుకు దాదాపు 200 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. ఇందులో తక్కువ నీటిని మాత్రమే గార్డెనింగ్, ఫ్లషింగ్ కోసం వాడుతుండగా.. మెజారిటీ నీరు నాలాల ద్వారా కుంటలు, చెరువుల్లోకి వృథాగా కలిసిపోతోంది. ఈ వృథాను అరికట్టి ఆ నీటిని పునర్వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన ఈ గ్రే వాటర్ సేకరణ కోసం జలమండలి ప్రత్యేకంగా రెడ్ కలర్ ట్యాంకర్లను ప్రవేశపెట్టనుంది. తాగే నీటి సరఫరా కోసం ప్రస్తుతం బ్లూ రంగు ట్యాంకర్లు వాడుతున్నారు. శుద్ధి చేసిన మురుగునీటి కోసం ఎరుపు రంగు ట్యాంకర్లను కేటాయించారు. గేటెడ్ కమ్యూనిటీలు తమ వద్ద ఉన్న నీటిని విక్రయించడానికి జలమండలిని సంప్రదిస్తే.. ఖాళీ ట్యాంకర్ నేరుగా వారి వద్దకు పంపి నీటిని సేకరించనున్నారు.సేకరించిన నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాత.. దానిని తాగేందుకు కాకుండా ఇతర అవసరాలైన భవన నిర్మాణాలు, లాండ్స్కేపింగ్, గోల్ఫ్ కోర్స్ నిర్వహణ, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం నగరంలో శుద్ధి చేసిన నీటిలో 2 శాతం కంటే తక్కువే వాడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కొత్త వాటర్ బ్యాంక్ ద్వారా దీనిని 2000 ఎంఎల్డీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన మూడు ట్యాంకర్లతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ను బట్టి వీటి సంఖ్యను పెంచనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారుప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు. గతేడాది మార్చిలో 2.1 లక్షల ట్యాంకర్ల వినియోగం ఉంటే.. ఈ ఏడాది ఆ సంఖ్య 2.24 లక్షలకు చేరుకుందన్నారు. ప్రతి రోజూ సరాసరి 7500 ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డొమస్టిక్ ట్యాంకర్ రూ.500, కమర్షియల్ అయితే రూ.850 చొప్పున వసూలు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

# హామీల అమలు కోసం ఉద్యమిస్తాం



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన హామీలను ఆరు నెలల్లోపు అమలు చేస్తామని ఇప్పటివరకు ఒక్క హామీని కూడా అమలు చేయకుండా గిరిజనులను మోసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ త్వరలోనే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.గురువారం గార్ల మండలం లోని గిరిజన తండాల్లో పర్యటిస్తూ తండా కమిటీలు, సభ్యత్వ క్యాంపియన్ చేపట్టారు.మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను భోజన వసతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మంగపతి రావు భవన్ లో భూక్య పూల్ సింగ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే సమక్షంలో అసెంబ్లీ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో గిరిజనులకు 15 రకాల వాగ్దానాలు ఇచ్చిందని గుర్తు చేశారు. వీటన్నిటిని అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు అమలు చేస్తామన్న ప్రభుత్వం రెండున్నర ఏళ్ల అవుతున్న ఒక్క హామీని కూడా అమలు చేయకుండా 40 లక్షల మంది గిరిజనులను మోసం చేసిందని విమర్శించారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచుతామని, అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రతి ఇంటికి 12 లక్షల రూపాయలు రుణమిస్తామన్నారని. సమ్మక్క సారక్క పథకం కింద ప్రతి గిరిజన తండా గూడెం గ్రామపంచాయతీకి ప్రతి ఏటా 25 లక్షల రూపాయలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులకు ఐదు జిల్లాల్లో ప్రత్యేక ఐటిడిఏ లను ఏర్పాటు చేస్తామని, బంజారా ఏజెన్సీ ఎరుకల మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ప్రతీ కార్పొరేషన్ 500 కోట్ల రూపాయలు కేటాయిస్తామన్న డిమాండ్ల లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ హామీల సాధన కోసం కలిసి వచ్చే ఇతర గిరిజన సంఘాలను కలుపుకొని మే నెలలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి భూక్య హరి మాట్లాడుతూ గార్ల మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణం మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లేకపోతే కలిసొచ్చే రైతులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న, సహాయ కార్యదర్శి మాలోత్ కిషన్, మండల నాయకులు రుణవాల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు అనంతరం ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు రాగం రమేష్ మాట్లాడుతూ మద్దివంచ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో సీతంపేటలో ఉన్న కొనుగోలు కేంద్రానికి మద్ది వంచనుండి కొత్త తండా రాంపురం పాకాల ఏటి బ్రిడ్జి వల్ల రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని. బ్రిడ్జి పై నుండి రాకుండా బయ్యారం మీదుగా సీతంపేటకు రావడానికి అధిక ఖర్చు చేయాల్సి వస్తుందని. ఉన్నతాధికారులు దృష్టి సారించి తక్షణమే మద్దివంచ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు పరిమితి లేకుండా

మొక్కజొన్న మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎకరానికి ఇన్ని కింటాలే కొనుగోలు చేస్తాం అని చెప్పటం వలన రైతులందరూ ఆందోలనలో ఉన్నారని అన్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎకరానికి మొక్కజొన్న లు 40నుండి 45 కింటాల దిగుబడి వస్తుంది.ప్రభుత్వం ఎకరానికి 20 కింటాలే కొనుగోలు చేస్తాం అని చెప్పటం వలన రైతులందరూ ఇబ్బంది పడాల్సి వస్తుందని ఎటువంటి షరతులు లేకుండా పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంపాల వెంకన్న,కట్టెబోయిన రాములు నాగేశ్వరరావు, కట్టభోయిన శ్రీనివాస్,చల్లా మల్లేష్, కట్టెబోయిన వెంకన్న, లింగుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరైన గార్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీ వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యత్వ ప్రమాణ స్వీకారోత్సవం ఢిల్లీలో జరగగా ఆ కార్యక్రమానికి గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనియాకుల రామారావు రైల్వే బోర్డు మెంబర్ లచ్చిరాం నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోతు శ్రీనివాస్ నాయక్ లు ఎంపీ పోలిక బలరాం నాయక్ తో కలిసి పాల్గొన్నారు ప్రమాణస్వీకారం అనంతరం తెలంగాణ భవన్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవేం నరేందర్ రెడ్డి గారి అనుభవం రాజ్యసభలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు. రాజ్యసభలో తెలంగాణ వాణిని మరింత బలంగా వినిపించి తెలంగాణ అభివృద్ధిలో మరింతభాగస్వామ్యం కావాలని కోరారు.

# కాంగ్రెస్ సీనియర్ నేతకు ఘన నివాళులు...



**ఖమ్మం రూరల్, పెన్ పవర్** 16.4.2026 టీపీసీసీ నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నగర కమిటీ మాజీ.పీసీసీ. అధ్యక్షుడు మహమ్మద్ జుబేద్ అకాల మరణం పట్ల సీపీఐ అధ్యక్షుడుజిల్లా సమితి సభ్యులు భాగం హేమంతరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఖమ్మం రెడ్ హిల్స్ లో జావిద్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జావిద్ మరణం జిల్లా. రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలోజిల్లా కార్యదర్శి దండి సురేష్ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి,నగర కార్యదర్శి నాఖ జానీమియా,కార్యవర్గ సభ్యులు ఎండీ సలాం,యానాలీ సాంబశివారెడ్డి,సమితి సభ్యులు సైదా,వరద నర్సింహారావు,చింతల్ రమేష్ పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం సరైన పద్ధతి కాదని టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపిటిసి శీలంశెట్టి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారుపార్లమెంట్ వేదికగా ఒక బాధ్యతాయుతమైన ఎంపీ ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం, ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం చారిత్రక తప్పిదం మాత్రమే కాదని తెలంగాణ ప్రజలమనోభావాలను గాయపరచడమేనని అన్నారు. విద్యార్థులు యువకులు అమరుల బలిదానాల ఫలితంగా తెలంగాణ సిద్ధించిందనితెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని వెంటనే తెలంగాణ ప్రజలకు ఎంపీ తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం సురక్షితమని డాక్టర్ హన్మంతరావు అన్నారు. గార్ల మండల పరిధిలోని పూసల తండా గ్రామానికి చెందిన బాదావత్ స్వరూపకు నొప్పులు రావడంతో భర్త మహేష్ గార్ల మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి గురువారం తీసుకురాగా వైద్య సిబ్బంది సుఖ ప్రసవం చేశారు 2.8 కేజీల మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు, అనంతరం డాక్టర్ హన్మంతరావు మాట్లాడుతూ ప్రేవేట్ ఆసుపత్రి కంటే ప్రభుత్వ దవాఖానలోనే మేరుగైన వైద్యం లభిస్తుందని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పుష్పలత స్వాతి వినీల ఆశాలత ఏకలక్ష్మి స్పందన తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై సమీక్షా సమావేశం





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 16:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిందని

సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలని డిపిఓ హరిప్రసాద్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గార్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం రోడ్డులో గల కృష్ణా తార ఫంక్షన్ హాల్ లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా అధికారి డి.పి.ఓ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సును కాంక్షించి గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా గ్రామాలు ప్రగతి ప్రథమలో పయనించేందుకు పాటుపడాలన్నారు. విధి నిర్వహణలో కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ కొనసాగాలన్నారు. గ్రామపంచాయతీ తీర్మానాల ద్వారానే నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి నివాసములో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, తడి పొడి చెత్త ద్వారా స్వాభావిక ఎరువుల వినియోగానికి దోహదం చేయాలన్నారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించి రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ, ప్రయాణించి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవాలన్నారు. పలువురు సర్పంచులు గంగావత్ రామ్ సింగ్ నాయక్, పెద్ద కిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన సోదాహరణంగా వివరించారు. బానోత్ పార్వతి నాయక్ మోతిలాల్ (బంజర) రామ్ సింగ్ నాయక్ (మర్రిగూడెం) తదితరులు ఆ,యా గ్రామపంచాయతీలలో ప్రజా సంక్షేమ కార్యక్రమాల తీరు తెన్నులను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎంపీడీవో మంగమ్మ తాసిల్దార్ శారద, రాజేష్, సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలపై అవగాహన కల్పించాలి

**ములుగు, ఏప్రిల్ 16 పెన్ పవర్:** ములుగు జిల్లా అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు రూపొందించాలని, ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో అమల్లో ఉన్న చట్టాలపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం యాక్షన్ ప్లాన్ అమలులో కచ్చితత్వం ఉండేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# బెల్లంపల్లి ప్రజాప్రతినిధులు అభివృద్ధికి పాటుపడాలి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 16 పెన్ పవర్:** బెల్లంపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కన్నాల గ్రామపంచాయతీ రైతు వేదికలో జరిగిన సర్పంచులు, అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.

# మేయర్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు గ్రహీత సన్మానం



**మంచిర్యాల, ఏప్రిల్ 16 పెన్ పవర్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా, మంచిర్యాల జిల్లాలోని రవీంద్ర భారతిలో జరిగిన ఉత్సవాల్లో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, దళిత రత్న అవార్డు గ్రహీత కొండ్ర ఉదయ్ మాదిగను సన్మానించారు. ఈ సన్మానం ద్వారా దళిత సమాజానికి చెందిన ప్రతిభావంతులను గుర్తించి, ప్రోత్సహించే దిశగా ఒక అడుగు పడిందని, మేయర్ ధరణి మధుకర్ ఉదయ్ మాదిగ కృషిని అభినందించారని తెలిపారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన

**చెన్నూరు, ఏప్రిల్ 16 పెన్ పవర్:** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా జన్నారం మండల కేంద్రంలో ఫైర్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పే విధానం, ఎల్పీజీ గ్యాస్ ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రవీందర్ రెడ్డి, చంద్రయ్య, వినోద్, ప్రశాంత్, శ్రీకాంత్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లోనే మహిళ ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 పెన్ పవర్:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కగజ్‌నగర్ మండలంలోని బారేగూడ గ్రామానికి చెందిన గర్భిణికి ప్రసవ వేదనలు తీవ్రమవడంతో, ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో 108 అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం జరిగింది. ఈఎంటి రమేష్ యాదవ్, పైలెట్ ఖలీక్ సమయస్ఫూర్తితో డెలివరీని విజయవంతంగా నిర్వహించారు. అనంతరం తల్లీబిడ్డలను కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

# గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ

**సిర్పూర్, ఏప్రిల్ 16 పెన్ పవర్:** కొమురంభీం జిల్లా, తిర్యాని మండలం, మంగి గ్రామంలో సర్పంచ్ రాయిసిడాం వినోద్ ఆధ్వర్యంలో, ఫారెస్ట్ శాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామాజిక కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి చేతుల మీదుగా పశువుల తొట్టి శుభ్రం

**జగిత్యాల, ఏప్రిల్ 16 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న పశువుల తొట్టిలో పేరుకుపోయిన మురికి, దుర్గంధంపై ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన పోస్ట్‌కు స్పందించి, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి స్వయంగా ఆ తొట్టిని శుభ్రం చేసి, మంచినీటితో నింపి అందుబాటులోకి తెచ్చారు. రెండు రోజుల క్రితం బస్టాండ్ మూత్రశాల, అంతకుముందు డ్రైనేజీని కూడా ఆయన శుభ్రం చేశారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరుతున్నారు.

# అక్రమ మద్యం అమ్మకాలపై గ్రామసభలో తీర్మానం

**కోరుట్ల, ఏప్రిల్ 16 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం కంది కట్కూర్ గ్రామంలో మహిళల కోరిక మేరకు గ్రామసభలో గ్రామపంచాయితీ పాలకవర్గం అక్రమ మద్యం అమ్మకాలను నిషేధిస్తూ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఎక్సైజ్ అధికారులకు తెలియజేసినా, అక్రమ మద్యం అమ్మకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి అభినందన




**మంథని, ఏప్రిల్ 16 పెన్ పవర్:** సుల్తానాబాద్ మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు గురువారం భూపతిపూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థిని బట్టు సౌమ్యను అభినందించారు. ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాలలో 994 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన సౌమ్యను శాలువా, మెమెంటోతో సత్కరించారు. గ్రామీణ ప్రాంతం నుండి చదువుకుని రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషదాయకమని వారు తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ సమావేశం జరిగింది.

# ఉద్యమకారులకు చలో హైదరాబాద్ పిలుపు

**ఖమ్మం రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 16** మీడియా మిత్రులకు ఉద్యమ నమస్కారాలు ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ
చలో హైదరాబాద్ ఈనెల 18వ తారీకు ఉద్యమకారుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ గారు, డాక్టర్ శీలం పాపారావు గారు, డాక్టర్ పాలకుర్తి కృష్ణ గారు, అధ్యక్షతన జరిగే తెలంగాణ ఉద్యమకారులు ఫోరం కార్యకర్తలు సమావేశం తార్నాకలో మర్రి కృష్ణ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేయడం జరిగింది. అట్టి సమావేశానికి, మన పాలేరు నియోజకవర్గం లోని తెలంగాణ ఉద్యమకారులు అందరు రావాల్సిందిగా కోరుకుంటున్నాను, నేను మీ ఎదురుగట్ల చిట్టిమల్లు తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం,ఖమ్మం, కన్వీనియర్ గా ఉన్నాను మీ అందరికీ తెలుసు మన పాలేరు నియోజకవర్గం లో తెలంగాణ ఉద్యమకారులు అన్నాతమ్ములు అక్కాచెల్లెళ్లు అందరూ ఏకమై బాధ్యతగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.



03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బహుముఖ ప్రజ్ఞాశాలి బెంజమిన్

**హైదరాబాద్ పెన్ పవర్:** బెంజమిన్ ఫ్రాంక్లిన్ (జనవరి 17, 1706-ఏప్రిల్ 17, 1790) అమెరికా విప్లవంలో పాల్గొని అమెరికా దేశాన్ని, రాజ్యాంగాన్ని స్థాపించిన విప్లవకారుల్లో ఒకడు. ఆయన బహుకళా ప్రావీణ్యుడు, గొప్ప రచయిత, చిత్రకారుడు, రాజకీయ నాయకుడు, శాస్త్రవేత్త, మేధావి. ఆయన కనిపెట్టిన వాటిలో 'ఛత్వారపు కళ్ళద్దాలు', "ఓడొమీటర్ (ప్రయాణించిన దూరాన్ని సూచించేది)" మొదలగునవి చాలనే ఉన్నాయి. అగ్నిమాపక విభాగం, తపాలా సేవ, ఆసుపత్రి, లైబ్రరీ, అకాడమీ స్థాపనలో ఫ్రాంక్లిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఫ్రాంక్లిన్ "మొదటి అమెరికన్" అనే బిరుదుని కూడా పొందాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ 1706 జనవరి 17 ఆదివారం మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో జన్మించాడు. పిడుగులు పడి ఎన్నో విలువైన కట్టడాలు కూలిపోతూ ఉండడాన్ని చూసిన ఆయన, పిడుగుల బారి నుండి కట్టడాలను కాపాడటం కోసం "లైట్నింగ్ కండక్టర్" లను తొలిసారిగా 1752లో రూపొందించాడు. సముద్రం మీద కూడా ఎన్నో రకాల పరిశోధనలు చేసి సముద్రంలో చమురు వేస్తే దాని అలజడి తగ్గుతుందని కనుగొన్నాడు. ఆయన రూపొందించిన స్టౌవ్ లు, బై ఫోకల్ కంటి అద్దాలు ఇప్పటికీ వాడబడుతూ ఉన్నాయి. ఆమ్లీకృతంగా ఉన్న భూములలో సున్నం కలిపి తటస్థం చేయవచ్చని సూచించాడు. గాలి, వెలుతురు లేని చోట్ల అంటువ్యాధులు త్వరగా ప్రబలుతాయని కూడా హెచ్చరించాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తండ్రి బెన్ బోధకుడిగా మారాలని కోరుకున్నాడు. ఎనిమిదేళ్ళ వయసులో అతన్ని వ్యాకరణ పాఠశాలకు పంపాడు. పది సంవత్సరాల వయస్సు వరకు కొత్త పాఠశాలలోనే ఉన్నాడు. తన పాఠశాల రోజుల నుండి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఒక నావికుడు కావాలను కున్నాడు. అతని తండ్రి అంగీకరించ లేదు. బెన్‌ను తన అన్నయ్య ప్రింటింగ్ షాపులో నేర్చుకోవడానికి పంపాడు. బెన్ ఫిలడెల్ఫియా, తర్వాత ఇంగ్లాండ్‌లో ఈ అభ్యాసాన్ని కొనసాగించాడు. చివరికి ఫిలడెల్ఫియాలో తన సొంత ముద్రణ వ్యాపారాన్ని స్థాపించాడు. రాజకీయాలతో సంబంధం పెట్టుకునే ముందు, బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఫిలడెల్ఫియాలో ఒక ప్రింటింగ్ షాపును కలిగి, 1747 లో ప్రింటింగ్ నుండి రిటైర్ అయ్యాక, ఫిలడెల్ఫియా యొక్క పోస్ట్ మాస్టర్, బ్రిటిష్ నార్త్ అమెరికా కో-డిప్యూటీ పోస్ట్ మాస్టర్ గా కూడా పనిచేశాడు. 1775 లో, అతను యునైటెడ్ స్టేట్స్ యొక్క మొదటి పోస్ట్ మాస్టర్ జనరల్ అయ్యాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ సుదీర్ఘ ఆవిష్కరణల జాబితాలో బైఫోకల్స్, మెరుపు రాడ్, గ్లాస్ అర్మోనికా, ఒక లైబ్రరీ కుర్చీ, ఈత రెక్కలు, దీర్ఘకాల పరికరం, ఫ్రాంక్లిన్ స్టవ్, కాథెటర్ తదితరులు ఉన్నాయి. 1741 లో, బెన్ ఫ్రాంక్లిన్ స్టవ్ అనే ఇనుప కొలిమిని కనుగొన్నాడు. బెన్ వయసు పెరిగేకొద్దీ అతని దృష్టి క్షీణించింది. అతను చదవడానికి ఇష్టపడ్డాడు. రెండు జతల గ్లాసుల మధ్య మారడం అలసి పోయాడు. ఒకటి విషయాలు దగ్గరగా చూడటానికి అతనికి సహాయ పడింది, మరొకటి దూరంగా చూడటానికి. అందువల్ల అతను రెండు జతల నుండి కటకములను సగానికి కట్ చేసి, ఆపై ప్రతి లెన్స్‌లో సగం ఒకే చట్రంలో ఉంచి, బైఫోకాల్స్‌ను కనుగొన్నాడు. తన జీవిత కాలంలో, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనేక రచనలు చేశాడు. బాగా తెలిసిన వాటిలో పూర్ రిచర్డ్ యొక్క అల్మానాక్ , రిచర్డ్ సాండర్స్ అనే మారుపేరుతో రాసిన వార్షిక ప్రచురణ తదితరాలు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, పెన్సిల్వేనియా హాస్పిటల్ మరియు ఫ్రాంక్లిన్ మరియు మార్షల్ కాలేజీని స్థాపించారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ తన జీవిత కాలంలో అనేక అంతర్జాతీయ ప్రయాణాలు చేశాడు. 1776-84: ఫ్రాన్స్‌కు అమెరికన్ కమిషనర్‌గా పనిచేస్తూ, ఫ్రాన్స్‌తో కూటమి ఒప్పందంపై చర్చలు జరిపారు. మరణానంతరం కూడా గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు వ్రాయి
లేదా వ్రాయదగిన పనులు చెయ్యి. తృప్తి పేదవాడ్ని ధనవంతుడిగా చేస్తుంది. అసంతృప్తి గొప్పవాణ్ణి పేదవాడిగా మారుస్తుంది. కోపంతో మొదలుపెట్టిన పని తప్పనిసరిగా అవమానాల పాలౌతుంది. ఖాళీ సమయం కావాలనుకుంటే సమయాన్ని సరిగ్గా వినియోగించు కోవాలి. కారణం లేకుండా ఎవరికి కోపం రాదు. అయితే ఎప్పుడో గాని సరైన కారణం ఉండదు. సహనం కలవాడు ఏదైనా సాధించగలడు. మంచి యుద్ధం, చెడ్డ శాంతి అనేది ఎప్పుడూ ఉండదు... ఆయనకు జీవిత కాలంలో ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ లో అతను సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. అమెరికా స్వాతంత్ర్యం కోసం కృషి చేసి, 1766 జూలై 4న స్వాతంత్ర్య ప్రకటన చేస్తూ సంతకాలు చేసిన వారిలో ఫ్రాంక్లిన్ కూడా ఉన్నాడు. 1777 లో రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ఇతను కూడా ఎంతగానో సహకరించాడు. శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా పరిణితి చెందిన ఆయన 1770 ఏప్రిల్ 17న మరణించాడు.

# దేశాధ్యక్షుడు అయిన తత్వవేత్త

**హైదరాబాద్ పెన్ పవర్:** డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (సెప్టెంబర్ 5, 1888 ? ఏప్రిల్ 17, 1975) భారత దేశపు మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని పేరెన్నిక గన్న మహా మహోపాధ్యాయుడు. రెండు పర్యాయాలు ఉప రాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారత దేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) నాటి ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు. మహా మేధావిగా, గొప్పవ్యక్తిగా, గొప్ప గ్రంథకర్తగా, తత్వవేత్తగా, ప్రపంచ దేశాల మన్ననను అందుకున్న రాధాకృష్ణన్ భారతీయ మహర్షుల కోవకు చెందిన వారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5- 1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళ నాడుకు వలస వెళ్లిన తెలుగు దంపతులు అయిన సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరా స్వామి ఒక జమీందారీలో తహసిల్దార్. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యా భ్యాసము ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచి పోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగు చోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందారు. బాల్యం నుండి అసాధారణమైన తెలివి తేటలు కలవారాయన. 21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను తెలుసుకుని, మైసూరు విశ్వ విద్యాలయం ఉపకులపతి హెచ్.వి.నంజుండయ్య ఆయనను పిలిపించి ప్రొఫెసర్ గా నియమించారు. ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా. అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్‌లు కోరారు. దాంతో అతను కలకత్తా వెళ్ళారు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడుగా వున్నప్పుడు అతను 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంస లందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. అప్పట్లో డా. రాధాకృష్ణన్ పిలుపును అనుసరించి ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, హుమయూన్ కబీర్ వంటి మేధావులు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ "లీగ్ ఆఫ్ నేషన్స్ 'ఇంటలెక్చ్యువల్ కో-ఆపరేషన్ కమిటి'" సభ్యులుగా ఎన్నుకో బడినారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్య మతాల గౌరవ అధ్యాపకునిగా అయినారు. చైనా, అమెరికా దేశాల్లో పర్యటించి పెక్కు ప్రసంగాలు చేశారు. 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు అయినారు. 1947 ఆగస్టు 14-15తేదీన మధ్య రాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులను ఎంతో ఉత్తేజ పరిచింది.
1949లో భారత దేశంలో ఉన్నత విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఒక కమిటి నియమించింది. దానికి అధ్యక్షుడు డా. రాధాకృష్ణననే. డా.రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952-62 వరకు భారత ఉప రాష్ట్రపతిగా పనిచేశారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టిన రోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని అతను కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును "ఉపాధ్యాయ దినోత్సవం"గా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. రాధాకృష్ణన్ ది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారి వృత్తి చేయ మన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతి లోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ చదువంతా ఉపకార వేతనాల తోనే సాగి పోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో అతను నేలను శుభ్ర పరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగి యిచ్చేవారు. ఆయన దృష్టిలో తత్వము అనేది జీవితాన్ని అర్థం చేసు కోవటానికి ఒక మార్గము, భారతీయ తత్వమును అర్థం చేసు కోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించే వారు. భారతీయ ఆలోచనా దృక్పధాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, అందులో వివేకము, తర్కము ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్విక చింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తాత్విక శాస్త్ర ఉపన్యాసకుడిగా, ఉప ప్రాధ్యాపకుడిగా, ప్రాధ్యాపకుడిగా వివిధ పదవులను అలంక రించారు. 1918 నుండి 1921 వరకు మైసూరు విశ్వ విద్యాలయంలో తత్వశాస్త్ర ప్రాధ్యాపకుడిగా (ప్రొఫెసర్) పని చేసారు. 1921లో, అప్పటి భారతదేశం లోని కలకత్తా విశ్వ విద్యాలయంలో ముఖ్య తాత్విక పీఠమైన, కింగ్ జార్జ్ 5 చెయిర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్ కు రాధాకృష్ణన్‌ను నియమించారు. 1926 జూన్‌లో బ్రిటనులో జరిగిన విశ్వ విద్యాలయాల కాంగ్రెసులో కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. తరువాత ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డు విశ్వవిద్యాలయం నిర్వహించే అంతర్జాతీయ తాత్విక కాంగ్రెస్ లో సెప్టెంబర్ 1926లో కూడా కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా పని చేసారు. 1936లో, స్పాల్డింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఈస్ట్రన్ రిలీజియన్స్ అండ్ ఎథిక్స్ అనే పీఠంలో ఆక్స్‌ఫర్డు విశ్వ విద్యాలయంలో 1952లో భారతదేశ ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించే వరకు కొన సాగారు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా, 1949 నుండి 1952 వరకు రష్యాలో భారత రాయబారిగా పని చేసారు. 1946 నుండి 1950 వరకు పలుమార్లు భారతదేశం తరుపున యునెస్కో సభ్య బృందానికి అధ్యక్షత వహించారు. 1948లో విశ్వ విద్యాలయాల విద్యా కమిషనుకు అధ్యక్షుడిగా భారత ప్రభుత్వంచే నియమింప బడ్డారు. 1948లో యునెస్కో కార్యనిర్వాహక బృందానికి అధ్యక్షుడిగా ఉన్నారు. 1952లో యునెస్కో అధ్యక్షునిగా ఎంపిక అయ్యాడు. 1962లో బ్రిటీషు ఎకాడమీకి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. 1931లో బ్రిటీషు ప్రభుత్వం వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక "సర్" బిరుదు ఆయనను వరించింది. 1954లో మానవ సమాజానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా భారత దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "భారతరత్న" బిరుదు పొందారు. 1961లో జర్మనీ పుస్తక సదస్సు యొక్క శాంతి బహుమానం పొందారు. 1963 జూన్ 12న బకింగ్ హామ్ ప్యాలెస్ లోని ఆర్డర్ ఆఫ్ మెరిట్‌కి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలయిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి, మొదలయిన వాటి నుండి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేటులు సంపాదించారు.

# తండ్రి చాటు నుంచి.. తండ్రిని దాటేసే స్థాయికి నారా లోకేష్...

## ఒక్కో మెట్టు ఎక్కుతూ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాకా...

**విజయవాడ, ఏప్రిల్ 16 పెన్ పవర్:**
చంద్రబాబు కుమారుడు నారా లోకేష్‌కి వారసత్వమే మొదటి సవాల్ అంటే ఆశ్చర్యం కలగొచ్చు. కానీ చంద్రబాబు కుమారుడు టీడీపీ భవిష్యత్ నేతగా ఎదగాలంటే లోకేష్ ప్రతీ అడుగులో విమర్శలు, పోలికల పరీక్షలు నెగ్గాల్సొచ్చింది. రాజకీయ ఆసక్తి ఉన్న యువకుడిగా ఆయన అర్హతలు వాటిముందు తూగలేక పోయాయి. కార్యకర్తల సంక్షేమం మొదటి భాద్యతగా పార్టీలో అడుగుపెట్టి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఇప్పుడు పార్టీకి భవిష్యత్ నేతగా ఎదగటం ఆషామాషీ కాదు. 2013లో రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఆయనపై 'వారసుడు' అనే ముద్ర బలంగా పడింది. ప్రతిపక్షాల నుంచి ఎదురైన వ్యక్తిగత విమర్శలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఆయన్ని మానసికంగా దెబ్బతీయాలని చూశాయి. ముఖ్యంగా ఆయన ప్రసంగ శైలి, తెలుగు ఉచ్ఛారణ మొదలు ను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేసిన విమర్శలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. కానీ, ఒకరకంగా ఆ విమర్శలే ఆయనను రాటుదేల్చాయి. లోకేష్ తన లోపాలను సరిదిద్దుకుంటూ, మౌనంగా తన పని తాను చేసుకుంటూ పోయారు.చంద్రబాబు నాయుడు పాలనపై దృష్టి పెట్టిన సమయంలో, పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేసే బాధ్యతను లోకేష్ భుజాన వేసుకున్నారు. 'కార్యకర్తల సంక్షేమ నిధి' ద్వారా వేలాది మంది కార్యకర్తలకు అండగా నిలిచారు. ఇది ఆయనకు పార్టీ కేడర్‌లో బలమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు, క్లిష్ట సమయాల్లో కార్యకర్త వెనుక నిలబడటమేనని ఆయన నిరూపించారు.2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోవడం లోకేష్ రాజకీయ జీవితంలో ఒక పెద్ద కుదుపు. కానీ, ఆ ఓటమి ఆయన్ని నిరుత్సాహపరచలేదు. ఆవిర్భావం నుంచీ పార్టీ ఒక్కసారి కూడా గెలుచుకోని స్థానాన్ని ఎంచుకోవడమే పెద్ద సవాలు. అన్నీ వడ్డించిన విస్తరిలో భుజించడం ఆయనకు తేలికే.. కానీ తన ప్రయత్నమే కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలవాలనే యత్నమే ఆయన పట్టుదలకు నిర్దర్శనం. అందుకే గెలిచిన ప్రత్యర్థి కంటే



ఎక్కువగా నియోజకవర్గంలో గడిపారు. ఓడినా అక్కడే ఉండి ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ఆయన పట్టుదలకు నిదర్శనం. ఈ పట్టుదలే 2024లో అదే మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించారు.నందమూరి, నారా వారసుడిగా లోకేష్ కు గుర్తింపు ఉన్నా.. యువ గళం పాదయాత్ర ఆయన్ను నాయకుడిగా మార్చింది. 4,000 కిలోమీటర్లకుపైగా సాగిన ఈ సుదీర్ఘ యాత్రలో అన్ని వర్గాల వారితో మమేకమయ్యారు, కార్యకర్తల మనోభావాలు తెలుసుకున్నారు. మండుటెండల్లో సైతం సాగిన ఈ యాత్రలో ఆయన తన మాట తీరును, బాడీ లాంగ్వేజ్‌ను పూర్తిగా మెరుగు పరచుకున్నారు. సమస్యలను అర్థం చేసుకోవడంలో లోకేష్ చూపిన చొరవ, ప్రత్యర్థుల విమర్శలకు ఆయన ఇచ్చిన కౌంటర్లు పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ పాదయాత్ర ద్వారా లోకేష్ తనను తాను ఒక మాస్ లీడర్‌గా ఆవిష్కరించుకున్నారు.చంద్రబాబు నాయుడు అనుభవం ఒక ఎత్తయితే, లోకేష్ ఆధునికత మరో ఎత్తు. లోకేష్ తనకంటూ ఒక ప్రత్యేకమైన టీమ్‌ను నిర్మించుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిమ్మకాయల విజయ్ లాంటి కొత్తతరం నాయకులను ప్రోత్సహిస్తూ పార్టీలో యువ రక్తాన్ని ఎక్కిస్తున్నారు. ఐటీ నిపుణులు, యువ మేధావులు, రాజకీయ విశ్లేషకులతో కూడిన ఈ బృందం పార్టీ ప్రచార శైలిని మార్చేసింది. డిజిటల్ మీడియాను ఉపయోగించుకోవడంలో, డేటా విశ్లేషణ ద్వారా నియోజకవర్గాల పరిస్థితులను అంచనా వేయడంలో టెక్నాలజీని అందిపుచ్చుకున్నారు లోకేష్. జెన్ – జెడ్ తరానికి తగినట్టు సోషల్ మీడియా వ్యూహాలు రచించే టీం ను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీయార్, చంద్రబాబు తరం నాయకుల వారసులను చేరదీస్తూ భవిష్యత్ నాయకులతో పార్టీని సిద్ధం చేస్తున్నారు.గతంలో ఐటీ, పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేసిన కాలంలోనే లోకేష్ తన పాలనలోనూ సమర్థత చాటుకున్నారు. గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో రికార్డు స్థాయి పనులుచేసారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై ఆయన దృష్టి సారించారు. రోజువారీ ప్రభుత్వ సేవల్లో సరళత తీసుకురావడం ద్వారా పనిచేసే ప్రభుత్వం అని నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ సేవలు తీసుకురావడంలో జాతీయ స్థాయిలో ఏపీ ఆదర్శంగా నిలిచింది. దాంతోపాటు పెట్టుబడులు భారీగా ఆకర్షించాలనే తపన చూపుతున్నారు.
మర్రిచెట్టు నీడలో మరో చెట్టు ఎదగడం కష్టం. లోకేష్ తాత ఎన్టీఆర్ లాంటి ఆకర్షణ, చంద్రబాబు క్రమశిక్షణ,చాతుర్యం ముందు దిగదుడుపే. కానీ వారిని అందుకోవాలన్న ఆత్రంకన్నా తనదైన శైలిని ఏర్పరచుకోవాలనే పట్టుదల లోకేష్ లో కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు తర్వాత టీడీపీ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్నకు లోకేష్ తన పనితీరే సమాధానం అంటున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం కేవలం పదవి దక్కించుకోవడం కాదు లక్షలాది కార్యకర్తల ఆకాంక్షలను మోసే బాధ్యత.

# స్టీల్, సిమెంట్, కంకర లేకుండా ఇళ్లు

**విజయవాడ, ఏప్రిల్ 16, పెన్ పవర్:** )ఇల్లు నిర్మించాలంటే స్టీల్, సిమెంట్, కంకర, ఇసుక వంటివి అవసరం. కానీ ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులలో ఇల్లు నిర్మించారు ఆర్కిటెక్ట్ కరుణాకర్ రెడ్డి. మూడున్నర వ్యవధిలోనే పాత పద్ధతిలో మోడ్రన్ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు. ఈ విధానంలో సహజ వనరుల వినియోగం 70 శాతం తగ్గుతుందని చెప్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని ఉపయోగించి, ఇలాంటి పర్యావరణహిత ఇల్లు కట్టినట్లు తెలిపారు.ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అనేది పెద్దల సామెత. ఇళ్లు కట్టాలన్నా, పెళ్లి చేయాలన్నా బోలెడు తతంగం ఉంటుందనేది దాని ఉద్దేశం. పెళ్లి సంగతి పక్కనబెడితే.. ఇల్లు కట్టాలంటే మాత్రం చాలా కావాల్సి ఉంటుంది. మనం కోరుకున్న రీతిలో, మనకు నచ్చిన విధంగా, పర్యావరణహితంగా ఇల్లు కట్టడమంటే చిన్నపాటి యజ్ఞం చేసినట్టే. ఇక ఇల్లు కట్టాలంటే ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్ వంటి నిర్మాణ సామాగ్రి, వాటికి అయ్యే ఖర్చు తడిసి మోపెడు అవుతుంటుంది. అయితే ఇవేవీ లేకుండానే పాతకాలం నాటి పద్ధతులు ఉపయోగించి అధునాతనమైన , అందమైన పర్యావరణహిత ఇల్లు కట్టొచ్చని చెప్తున్నారు కరుణాకర్ రెడ్డి అనే ఆర్కిటెక్ట్. ఈ విధానంలో ఆయన ఇల్లు నిర్మించారు.స్కాట్లాండ్‌లో తన చదువు పూర్తి చేసిన కరుణాకర్ రెడ్డి.. పర్యావరణ అనుకూల ఇళ్లను నిర్మించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో.. కంకర, సిమెంట్, స్టీల్, ఇసుక వంటివి ఏవీ అవసరం లేకుండానే అందమైన పర్యావరణహిత ఇళ్లను నిర్మించవచ్చని నిరూపిస్తున్నారు. ఇల్లు కట్టే స్థలంలోని మట్టికి డంగు కలిపి.. ఈ ఎకో ఫ్రెండ్లీ ఇల్లు నిర్మించారు కరుణాకర్ రెడ్డి. మరోవైపు పాతకాలంలో భవనాలు ఎలా నిర్మించేవారో అలాంటి విధానాన్ని ప్రస్తుత తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలా సంప్రదాయ పద్ధతిలో ఎకో ఫ్రెండ్లీ ఇళ్లు నిర్మిస్తున్నట్లు కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు.సాధారణంగా ఇళ్లు కట్టే విధానంలో ప్లాస్టింగ్ చేస్తుంటారని.. దీని వలన వేడి ఉత్పత్తి కావటమే కాకుండా, కార్బన్ డై యాక్సైడ్ విడుదల అవుతుందని ఈయన చెప్తున్నారు. అలాగే ఇసుక, ఇటుక, కంకర వంటివి కావాల్సి వస్తుందని.. దీంతో వనరులు తగ్గిపోతున్నాయన్నారు. ఇలాంటివి పెద్దగా అవసరం లేకుండానే మనకు ఉన్న స్థలంలోని మట్టిని ఉపయోగించి, మన చుట్టూ ఉన్న వాటితోనే ఇల్లు కట్టినట్లు చెప్తున్నారు. పాతకాలం నాటి విధానాన్ని రీడిజైన్ చేసి మూడున్నర నెలలో ఇల్లు కట్టినట్లు తెలిపారు.మరోవైపు ఈ విధానంలో ఇల్లు కట్టాలంటే ముందుగా ఇల్లు కట్టే స్థలంలోని మట్టిని, నేల స్వభావాన్ని పరీక్షిస్తారు. ఆ తర్వాత ఆ ఇంటిని రాయితో కట్టాలా లేక పూర్తిగా మట్టిగోడలు సరిపోతాయా అనేది నిర్ణయిస్తారు. ఇంటిని కట్టే స్థలంలోని నేల స్వభావాన్ని అనుసరించి, రాతితో కట్టాలా, పూర్తిగా మట్టిగోడలు నిర్మించాలా, ఎంత ఎత్తులో గోడలు కట్టాలనే విషయాలను డిజైన్ చేసుకుంటామని కరుణాకర్ రెడ్డి చెప్తున్నారు. ఇంటి రూఫ్ నిర్మాణం విషయానికి వస్తే పాతకాలంలో మాదిరిగా దూలాలను ఏర్పాటు చేసి.. దానిపై డంగుతో కలిసి స్లాబ్ వేస్తామంటున్నారు. ఈ విధానంలో ఇల్లు కట్టడం ద్వారా సహజ వనరుల వినియోగాన్ని 70 శాతం వరకూ తగ్గించవచ్చంటున్నారు.ఈ విధానంలో సిమెంట్, ఇనుము బదులుగా సున్నం, మట్టి, కలప వంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలను ఉపయోగిస్తారు. దీంతో ఈ ఇల్లు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయని.. మట్టి గోడలు సహజసిద్ధంగా వెంటిలేషన్ అందిస్తాయని అంటున్నారు.

# గిరిజన నియోజకవర్గాలపై దృష్టి

**కాకినాడ, ఏప్రిల్ 16, ( పెన్ పవర్:** ప్రతి రాజకీయ పార్టీ వ్యూహకర్తలను నియమించుకుంటోంది. కానీ జనసేనకు ఇంతవరకు వ్యూహకర్తలు లేరు. అయితే తాజాగా పార్టీ ఆ ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. జనసేన తరఫున ఓ బృందం ఉత్తరాంధ్రలో సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో ఈ బృందం పర్యటించి వివరాలు సేకరిస్తోంది. అయితే ఈ సర్వే బృందం ఐపాక్ అని ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోంది. ప్రస్తుతం జనసేన తరుపున సేవలందిస్తున్న వారు పక్క రాష్ట్రాలకు చెందిన వారుగా తెలుస్తోంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో జనసేన పరిస్థితి ఏంటి? అక్కడ ఏ పార్టీకి బలం ఉంది? జనసేన గ్రాఫ్ పెరిగిందా? అన్న వివరాలను ఆ సర్వే బృందం తెలుసుకుంటున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా విశాఖ జిల్లాలో జనసేన తరపున ఈ సర్వే జరుగుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూటు మార్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాలపై ఫోకస్ పెట్టారు. గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే మొదట్లో అంతా అంచనా వేయలేకపోయారు కానీ.. పక్కా రాజకీయ వ్యూహంతోనే పవన్ కళ్యాణ్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచేవారు గిరిజనులు. ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ అయ్యారు. అయితే ఆ ఓటు బ్యాంకు తెలుగుదేశం ఎంత ప్రయత్నించినా వర్కౌట్ కాదు. అందుకే ఆ బాధ్యతలను పవన్ కళ్యాణ్ తీసుకున్నట్టు కనిపించారు. అందుకే తరచూ గిరిజన ప్రాంతాల్లో పర్యటించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. కొండ శిఖర గ్రామాలకు సైతం రహదారులు నిర్మించారు. వారికి ప్రత్యేకంగా సొంత నిధులతో చాలా రకాల వసతులు కూడా సమకూర్చారు. అటు గిరిజనులు కూడా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక ప్రేమ చూపుతూ వచ్చారు.ఏపీలో ఆరు ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక పార్లమెంట్ స్థానం ఎస్టిలకు రిజర్వు అయింది. పునర్విభజనతో ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు పెరగనున్నాయి. మరోవైపు వచ్చే ఎన్నికల్లో సీట్లు ఎక్కువగా తీసుకోవాలని జనసేన భావిస్తోంది. తెలుగుదేశం పార్టీకి ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలపై పెద్దగా అంచనాలు లేవు. అందుకే అక్కడ పవన్ కళ్యాణ్ ను ప్రయోగిస్తున్నట్లు అర్థమవుతోంది. ఆయన సైతం తన వద్ద ఉన్న అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలతో గణనీయంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నారు.. గిరిజనులతో మమేకం అవుతున్నారు. అందుకే అక్కడ జనసేన గ్రాఫ్ ఎలా ఉందో తెలుసుకునేందుకు సర్వే సంస్థలను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. అయితే అవసరం అనుకుంటే ఐ ప్యాక్ టీమును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే గతంలో వైసిపికి పనిచేసిన వారు కాకుండా కొత్తవారిని నియమించుకునే అవకాశం కనిపిస్తోంది

# ఏడాదిలో 14 కోట్ల లడ్డూల విక్రయం

**తిరుమల ఏప్రిల్ 16, పెన్ పవర్:**
తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల అమ్మకాలు రికార్డు స్థాయి లో పెరిగాయి. 2025–2026కు సంబంధించి 13,95,43,231 లడ్డూలను విక్రయించారు. 2025–2026 (ఏడాదిలో)లో అదనంగా 1.76 కోట్ల లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. ఈ లడ్డూ విక్రయాల ద్వారా రూ.567 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది టీటీడీ ప్రస్తుతం రోజుకు 4 లక్షల వరకు లడ్డూలు తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వివరాలు ఇలా ఉన్నాయితిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతి రోజూ వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు. స్వామివారి దర్శనం తర్వాత లడ్డూ ప్రసాదాలను తీసుకుంటారు. గత ఏడాది కాలంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయాలు భారీగా పెరిగాయి. 2025–2026 వార్షిక ఏడాదిలో రికార్డు స్థాయిలో లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మొత్తం 13,95,43,231 లడ్డూలను భక్తులకు విక్రయించారు. 2024–2025 విషయానికి వస్తే 12,18,53,535 లడ్డూలను అమ్మారు. 2024–2025తో పోలిస్తే.. 2025–2026 (ఏడాదిలో) అదనంగా 1.76 కోట్ల లడ్డూలను విక్రయించారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది.. శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్క భక్తుడికి ఒక లడ్డూను ఉచితంగా ఇవ్వడంతో పాటు అదనంగా కావాలనుకునే వారికి రూ. 50కి ఒకటి చొప్పున లడ్డూ అందిస్తోంది. 2025–2026 వార్షిక ఏడాదిలో లడ్డూల విక్రయాల ద్వారా రూ. 567 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది.తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక వసంతోత్సవాలు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు భక్తి, వైభవాలతో ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందు ఏప్రిల్ 29న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు



రూ.150/– చెల్లించి వసంతోత్సవ సేవలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించబడుతుంది. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులకు దర్శనమిస్తూ కటాక్షిస్తారు.వసంతోత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 28వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం విశేషంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడతారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి మొదలైనవన్నీ పవిత్రజలంతో శుద్ధి చేయబడతాయి. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం,
గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. ఈ ఉత్సవాల నిర్వహణ కారణంగా ఏప్రిల్ 28 మరియు ఏప్రిల్ 30 నుంచి మే 02వ తేదీ వరకు కళ్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పద్మావతి అమ్మవారి కటాక్షాన్ని పొందాలని టీటీడీ కోరుతోంది.

# ఆటలో 20 కోట్లు ...

**తిరుపతి, ఏప్రిల్ 16, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన వైఫల్యాలు, అవినీతిని బయటపెడుతోంది కూటమి ప్రభుత్వం. ఇప్పటివరకు మద్యం కుంభకోణం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు మరో కుంభకోణం పై ఫుల్ క్లారిటీ వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భారీ అవినీతి జరిగిందని దర్యాప్తు లో తేలింది. రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ కీలక నివేదిక ఇచ్చింది. అప్పట్లో క్రీడల శాఖ మంత్రిగా ఆర్కే రోజా ఉండేవారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ శాప్ చైర్మన్ గా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఉండేవారు. ఇప్పుడు వారిద్దరి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్టు తెలుస్తోంది. తప్పకుండా అరెస్టు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. విజిలెన్స్ దర్యాప్తు పూర్తయింది. నివేదిక ప్రభుత్వానికి అందడంతో సీరియస్గా నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. కానీ అప్పట్లో సుదీర్ఘకాలం కొనసాగాయి క్రీడా పోటీలు. క్రీడా పరికరాల కొనుగోలుతో పాటు నిర్వహణలోనూ అడుగడుగునా అవినీతి జరిగిందన్నది అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై కూటమి అధికారంలోకి రాగానే విచారణ ప్రారంభం అయింది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత కొద్దిరోజులుగా ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దర్యాప్తు కొనసాగింది. అయితే చివరిగా రూ.20.37 కోట్లు దోచుకున్నారని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ నిగ్గు తేల్చింది. అయితే ఇందులో ఆర్కే రోజా తో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో వారి అరెస్టు తప్పదన్న ప్రచారం మొదలైంది.ఏదైనా కాంట్రాక్టు అప్పగించే ముందు అనుభవం, అర్హతలు పరిశీలిస్తారు. కానీ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ కాంట్రాక్టును తగిన అనుభవం, అర్హతలు లేని తమ కుటుంబ సన్నిహితుడికి కట్టబెట్టారు మంత్రి ఆర్కే రోజా. అప్పటి శాప్ చైర్మన్ హోదాలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తన ప్రధాన అనుచరుడిని ముందు పెట్టి అక్రమాలకు పాల్పడ్డారని దర్యాప్తు సంస్థ నిర్ధారించింది. అప్పట్లో ఆడుదాం ఆంధ్రకు సోషల్ మీడియాలో ప్రచారం పేరిట కూడా వైసిపి ఇన్ఫ్లుయెన్సర్లకు భారీగా నగదు మొట్ట చెప్పినట్లు తేలింది. బ్రాండింగ్, వీడియో, ఫోటోగ్రఫీ ల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగం చేశారని స్పష్టం చేసింది.. నాసిరకమైన క్రీడా పరికరాలతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని గుర్తించింది. మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, అతని ప్రధాన అనుచరుడైన శాప్ ఐటీ కన్సల్టెంట్ జీకే కిషోర్ బాబు పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసును ఏసీబీ లేదా సిఐడి కి అప్పగించాలని విజిలెన్స్ అండ్ అన్ఫోర్స్మెంట్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఆడుదాం ఆంధ్రాలో రోజాతో పాటు సిద్ధార్థ రెడ్డి అవినీతి చేశారని స్పష్టంగా తెలిసిపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో ఐప్యాక్ సభ్యురాలికి ప్రచార ఖర్చుల నిమిత్తం భారీగా కేటాయించినట్లు గుర్తించింది దర్యాప్తు సంస్థ. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం ప్రమేయంతోనే కేటాయింపులు చేసినట్లు గుర్తించడం విశేషం. ఈ మొత్తం వ్యవహారంలో రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి టార్గెట్ కానున్నారు అన్నమాట.

# టీడీపీలో మూడోతరం



**విజయవాడ, ఏప్రిల్ 16, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ లో నారా లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ గా పట్టాభిషేకం చేయడం కేవలం ఒక పదవి మార్పు మాత్రమే కాదు, అది పార్టీ చరిత్రలో మరో తరానికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఘట్టంగా కనిపిస్తోంది. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో తొలిసారిగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని సృష్టించి లోకేష్‌కు అప్పగించడం ద్వారా, చంద్రబాబు నాయుడు తన వారసుడికి పార్టీ పగ్గాలను అధికారికంగా బదిలీ చేసే దిశగా బలమైన అడుగు వేశారు. 75 ఏళ్ల వయసులో ఉన్న చంద్రబాబు, పాలనపై దృష్టి సారిస్తూనే పార్టీ సంస్థాగత బాధ్యతలను లోకేష్‌కు అప్పగించడం ఒక వ్యూహాత్మక ప్రయత్నంఈ సంస్థాగత మార్పుల్లో లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా యువతకు, అట్టడుగు స్థాయి నేతలకు పెద్దపీట వేస్తూ రూపొందించిన కొత్త కమిటీలు పార్టీలో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం వారసత్వ రాజకీయాలకే పరిమితం కాకుండా, యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లో సంపాదించుకున్న గుర్తింపు, ప్రస్తుతం ఐటీ మంత్రిగా చేస్తున్న అభివృద్ధి పనులు లోకేష్‌ను పార్టీలో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. క్షేత్రస్థాయి కార్యకర్తలే నాయకులు అనే నినాదాన్ని నిజం చేస్తూ సామాన్య నేతలను కూడా పొలిట్‌బ్యూరోలోకి తీసుకోవడం లోకేష్ శైలికి నిదర్శనం.లోకేష్‌కు అత్యంత సన్నిహితులైన రాజేష్ కిలారు వంటి వారికి జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగించారు. లోకేష్ టీమ్ ఇప్పుడు పార్టీ యంత్రాంగాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. పాత తరం అనుభవాన్ని గౌరవిస్తూనే, తనకంటూ ఒక బలమైన కోర్ టీమ్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి లోకేష్ సిద్ధమవుతున్నారు. ఇది పార్టీలో అంతర్గతంగా ఎటువంటి విబేధాలు రాకుండా సాఫీగా సాగుతున్న నాయకత్వ మార్పు. సామాజిక సమీకరణాల పరంగా కూడా ఈ మార్పులు అత్యంత వ్యూహాత్మకంగా ఉన్నాయి. 185 మందితో కూడిన రాష్ట్ర కమిటీలో 122 మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారికే ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా, టీడీపీ తన పాత సామాజిక పునాదులను మరింత పటిష్టం చేసుకుంటోంది. 40 శాతం బీసీలకు చోటు కల్పించడం ద్వారా బీసీల పార్టీ అనే ముద్రను తిరిగి చాటుకుంది. అలాగే మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా 50 మంది మహిళలకు కమిటీలో స్థానం కల్పించడం పార్టీ ఆధునిక దృక్పథాన్ని సూచిస్తోంది.ఈ మార్పులు 2029 ఎన్నికలే లక్ష్యంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో లోకేష్ ఇప్పుడు పార్టీకి ముఖ్య సేనాపతి గా మారారు. కేడర్ సంక్షేమం, డిజిటల్ నెట్‌వర్కింగ్, క్షేత్రస్థాయి బలోపేతంపై లోకేష్ చూపిస్తున్న ఆసక్తి టీడీపీని రాబోయే దశాబ్ద కాలం పాటు నడిపించేలా చేస్తోంది. ఈ పుత్రోదయం పార్టీకి కొత్త వెలుగునిస్తుందా లేదా అన్నది లోకేష్ భవిష్యత్తు వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## హార్ముజ్‌లో కూలిన అమెరికా నిఘా డ్రోన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా 238 మిలియన్ డాలర్ల (రూ.2,222 కోట్ల) విలువైన నిఘా డ్రోన్‌ను నష్టపోయింది . ఏప్రిల్ 9న హర్మూజ్ జలసంధిలో ఈ ఘటన జరిగినట్టు ఇప్పటికే వార్తలు రాగా.. తాజాగా అమెరికా నేవీ ధ్రువీకరించింది. ఎంక్యూ-4జ ట్రైటన్ పేరున్న దీనిపై ఎటువంటి దాడి జరగలేదని.. సాంకేతిక లోపంతో కూలిపోయినట్టు పేర్కొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని వెల్లడించింది.అంతర్జాతీయ గగనతలంలో హార్ముజ్ జలసంధిపై గస్తీలో ఉండగా ట్రైటన్.. అకస్మాత్తుగా ఎమర్జెన్సీ కోడ్‌ను రిలీజ్ చేసింది. ఆ తర్వాత 50వేల అడుగుల ఎత్తు నుంచి 10వేల అడుగుల ఎత్తుకు దిగొచ్చింది. అనంతరం కనిపించకుండా పోయింది. నేవీ సేఫ్టీ కమాండ్ దీనిని క్లాస్ ఏ ప్రమాదం గా వర్గీకరించింది. 2 మిలియన్ డాలర్లకుపైగా నష్టాన్ని, ఎయిర్‌క్రాఫ్ట్ పూర్తిగా ధ్వంసం కావడాన్ని దీనికింద పరిగణిస్తారు. తాజాగా ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించిన అమెరికా.. ఏ ప్రాంతంలో జరిగిందో మాత్రం బయటపెట్టలేదు.ఈ ట్రైటన్.. అమెరికా నేవీ ఆయుధశక్తిలో ఈ అధునాతన మానవరహిత వైమానిక వ్యవస్థల్లో ఒకటి. అధిక ఎత్తులో, సుదూర మిషన్ల కోసం దీనిని తీర్చిదిద్దారు. వ్యూహాత్మక జలమార్గాల్లో మారిటైమ్ ట్రాఫిక్, మిలిటరీ కదలికలను పర్యవేక్షించడంలో ఇది కీలకం. ఇప్పుడు దీనిని కోల్పోవడం అనేది యూఎస్ నేవీకి గట్టి దెబ్బే అని చెప్తున్నారు. ఇక, అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించిన అనంతరం ఈ ఘటన జరగడం గమనార్హం.

## లొంగదీసుకునే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ ఓడరేవులను లక్ష్యంగా చేసుకుని అమెరికా విధించిన దిగ్బంధనం నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై బలప్రయోగం చేయాలనే ఏ ప్రయత్నమైన విఫలమవుతుందని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ పరిస్థితులు, పూర్తి స్థాయి శాంతి కోసం చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు ఈ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమకు ఇచ్చిన ఓ ప్రకటనలో పెజెష్కియాన్ పేర్కొనట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.'ఇరాన్ నిర్మాణాత్మక సంభాషణకు కట్టుబడి ఉన్నప్పటికీ, ఎలాంటి ఒత్తిడి లేదా బలవంతానికి తలొగ్గదు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ మమ్మల్ని బలవంతంగా లొంగదీసుకునే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు. ప్రజలు అలాంటి చర్యలను ఎప్పటికీ అంగీకరించరు. ఇక ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ తీసుకున్న చర్యలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. ఈ దాడులు పౌర మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతాయి. అసలు ఎలాంటి అనుమతితో మా దేశంపై దాడులు జరుగుతున్నాయి? పౌరులపై, ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులు చేయడానికి ఏ న్యాయం ఉంది? ఇరాన్ శాంతి, దౌత్యపరమైన పరిష్కారాలను కోరుకుంటున్నప్పటికీ, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే చర్యలను కఠినంగా ఎదుర్కొంటాం' అని పెజెష్కియాన్ హెచ్చరించినట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది.

## హార్ముజ్‌ను తెరుస్తున్నాం
## రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ దేశాల కోసం హార్ముజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'హార్ముజ్ జల సంధిని నేను శాశ్వతంగా తెరిచినందుకు చైనా చాలా సంతోషిస్తోంది. నేను చైనా కోసం?ప్రపంచం కోసం ఆ పని చేశాను. ఈ పరిస్థితి ఇకపై ఎన్నడూ ఉత్ప న్నం కాదు. ఇరాన్‌కు ఆయుధాలు పంపరాదని వారు అంగీకరించారు. కొన్ని వారాల క్రితం నేను అక్కడికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు జిన్‌పింగ్ నన్ను పెద్దగా, బలంగా హత్తుకున్నారు. మేము కలిసి పనిచేసుకుం టున్నాం' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. కాగా ఇరాన్‌కు ఆయుధాలు అందించవద్దని జిన్‌పింగ్‌కు లేఖ రాశా నని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలు అందిస్తోం దని తాను విన్నానని, అలా చేయవద్దని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. తాను అలా చేయడం లేదని జిన్‌పింగ్ ప్రత్యుత్తరం ఇచ్చారని అన్నారు. ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం త్వరలోనే ముగియబోతోందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. యుద్ధాన్ని సైనిక చర్యతో ముగించబోవడం లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో రెండో విడత చర్చలకు అమెరికా సిద్ధమవుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'మాపని ఇంకా పూర్తి కాలేదు. మేము నిష్క్రమిస్తే ఇరాన్ పునర్నిర్మాణానికి 20 సంవత్సరాలు పడుతుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఒప్పందం చేసుకోవాలని వారు బలంగా కోరుకుంటున్నారని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ చెప్పారు. ఫాక్స్ బిజినెస్ ప్రతినిధితో ట్రంప్ బుధవారం మాట్లాడుతూ ఇరాన్‌పై ప్రత్యక్ష దాడి చేయాలన్న తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్మూలించడానికి ఆ చర్య అవసరమని అన్నారు. 'నేను ఆ పనిచేయకపోతే ఇరాన్ వద్ద ఇప్పటికే అణ్వాయుధం ఉండేది. ఒకవేళ వారి వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వారిని సర్ అని వినయంగా పిలవాల్సి వచ్చేది. అలా జరగాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ చెప్పారు. అలాగే పదివేల మందితో యూఎస్ బలగాలు పశ్చిమాసియాలో మకాం వేసి ఉన్నట్టు తెలిపారు.

## ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐక్యరాజ్యసమితి ఆధిపత్య పునరుద్ధరణలో, మరింత సముచితంగా.. సహేతుకంగా అంతర్జాతీయ నియమ నిబంధనలు అమలు జరిగేలా చూడటంలో చైనా-రష్యా కలిసి పనిచేయాలని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) వంటివాటిలో పరస్పరం సహకరించుకోవాలని అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, దానికి వ్యతిరేకంగా తమ దేశాలు రెండూ ప్రయత్నాలు ముమ్మరం చేయాలని చెప్పారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గే లవ్రోవ్ బుధవారం బీజింగ్‌లో తనతో భేటీ అయిన సందర్భంగా జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం నేపథ్యంలో గత కొద్దిరోజులుగా ట్రంప్ తీరును విమర్శిస్తున్న చైనా అధ్యక్షుడు మరోసారి వాటి తీవ్రతను పెంచారు."ప్రపంచం మళ్లీ ఆటవిక రాజ్యంవైపు వెళ్లిపోకుండా నిలువరించాలి. బహుళపాక్షిక వాదాన్ని.. అంతర్జాతీయ చట్టబద్ధపాలనను పునరుద్ధరించాలి.దీనికి మనం బలంగా అండదండలివ్వాలి. మన రెండు దేశాలు వ్యూహాత్మక కట్టుబాటుతో, పరస్పర విశ్వాసంతో ఒకదానికొకటి మద్దతు ఇచ్చుకోవాలి" అని లవ్రోవ్‌తో జిన్‌పింగ్ చెప్పారు.

## ఇరాన్‌ను దిగ్బంధించాం!
## కాల్పుల విరమణ పొడిగింపు వుండకపోవచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలు జరగకుండా పూర్తి స్థాయిలో దిగ్బంధించామని అమెరికా సెంట్రల్ కమాండ్ బుధవారం ప్రకటించింది. తామనుకున్న దిగ్బంధనాన్ని పూర్తి స్థాయిలో విజయవంతంగా అమలుపరిచామని తెలిపింది. కీలకమైన ప్రాంతీయ జల మార్గాలు ముఖ్యంగా హార్మూజ్ వ్యాప్తంగా అమెరికా బలగాలు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. బ్లాకేడ్‌ను ప్రారంభించిన 36గంటల వ్యవధిలోనే ఇరాన్ నుండి వెళ్ళే, వచ్చే వాణిజ్య నౌకల రాకపోకలను సమర్ధవంతంగా నిలువరించామని ఆ ప్రకటన పేర్కొంది. ఇరాన్‌తో రెండు వారాల కాల్పుల విరమణ గడువు ఈ నెల 21తో ముగియనుంది. ఈలోగానే ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్‌తో ప్రస్తుత కాల్పుల విరమణ గడువును పొడిగించే ఆలోచనేది ఇప్పటికి లేదని ట్రంప్ చెప్పారు. ఈలోగానే ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నాను, వారు కూడా అందుకే ప్రాధాన్యతనిస్తున్నారని ట్రంప్ ఎబిసి న్యూస్ చీఫ్ రిపోర్టర్‌తో వ్యాఖ్యానించారు. గడువు పొడిగించాల్సిన అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఒప్పందం కుదరడం వల్ల యుద్ధం ముగుస్తుందా లేక ఇరాన్ సామర్థ్యాలను దెబ్బతీయడం వల్ల యుద్ధం ఆగుతుందా అని ప్రశ్నించగా రెండింటికీ అవకాశం వుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే దౌత్యానికి తాము ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని కూలంకషంగా పరిశీలించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని, ఇరాన్‌తో కుదుర్చుకునే ఒప్పందంలో ఆ వివరాలు కచ్చితంగా వుండేలా చూడాలని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ డైరెక్టర్ రాఫెల్ గ్రాసి చెప్పారు.

# నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపుతో మారనున్న రాజకీయ దృశ్యం!

**హైదరాబాద్ పెన్ పవర్:** గురువారం పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టే రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు పేర్కొంటున్నట్లుగా లోక్‌సభలో సీట్ల సంఖ్యను 850కి పెంచి, 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన చేసి సీట్లను కేటాయించినట్లైతే భారతదేశ రాజకీయ మ్యాప్ చాలా మార్పులకు లోనవుతుంది. ప్రధానంగా ఉత్తర భారతంలోని హిందీ మాట్లాడే రాష్ట్రాలు లబ్ది పొందుతాయి. మరోవైపు దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఎక్కువ సీట్లను కోల్పోయే ప్రమాదం వుంది.




గురువారం నుండి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రధానంగా మూడు అంశాలు చోటు చేసుకోనున్నాయి. 1) లోక్‌సభ స్థానాలను 543నుండి 850కి పెంచడం (వీటిలో రాష్ట్రాలకు 815, కేంద్రపాలిత ప్రాంతాలకు 35). 2) సీట్ల కేటాయింపును 1971నాటి జనాభా లెక్కలతో ముడిపెట్టిన రాజ్యాంగపరమైన స్తంభనను తొలగించి ఆ స్థానంలో సాధారణ చట్టం ద్వారా జనాభా లెక్కలను ప్రాతిపదికగా ఎంచుకునేందుకు పార్లమెంట్‌ను అనుమతించే ఒక ఫార్ములాను ప్రవేశపెడుతుంది. 3) తాజాగా ప్రచురితమైన జనాభా లెక్కలు అంటే 2011 జనగణను ఉపయోగించుకునేలా నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌ను నియమిస్తుంది. ఆ కమిషన్ సరిహద్దులను పునర్నిర్వచించి, సీట్లను తిరిగి కేటాయిస్తుంది. నారీ శక్తి వందన్ అభియాన్, 2023 కింద మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యమని ప్రభుత్వం చెబుతోంది. 'ప్రొ రేటా బేసిస్' పై దక్షిణాది రాష్ట్రాలు ఒక్క సీటును కూడా కోల్పోవని గతేడాది ఫిబ్రవరిలోనే హోం మంత్రి అమిత్ షా కోయంబత్తూరులో చెప్పారు. 'దేశవ్యాప్తంగా దామాషా పెరుగుదల వుంటుంద'ంటూ దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలన్నీ సిల్లీగా వున్నాయని ఈ నెల 13న వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా వ్యాఖ్యానించారు.

## తమిళనాడులో బిజెపి అక్రమంగా ఎదగాలనుకుంటుంది




**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నాడిఎంకె నేత ఇపిఎస్ భుజాలపై స్వారీ చేసి అక్రమంగా తమిళనాడులో బిజెపి ఎదగాలను కుంటుందని సిపిఎం సీనియర్ నాయకురాలు బృందాకరత్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని మనాలి బస్ టెర్మినల్ సమీపంలోని కరంబ క్కూడిలో సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నిర్వహించిన బహిరంగ సభలలో ప్రసంగిం చారు. ఈ సందర్భంగా బృందా కరత్ బిజెపి దుర్మార్గాలను ప్రజలకు వివరించారు. బిజెపి అనుసరిస్తున్న మతతత్వ విధానాలను వ్యతిరేకిం చాలని , ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తమిళనాడు లౌకిక భావాలకు, ద్రావిడ సిద్ధాంతలకు నెలవని ఇక్కడ సంఘ్?పరివార్ ఆటలు సాగవన్నారు. సిపిఎం తిరువొత్తియూర్, గండర్వక్కోట్టై అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు ఎల్. సుందరరాజన్, ఎం. చిన్నదురైలను గెలిపించాలని కోరారు. అదేవిదం గా మనాలి బస్ టెర్మినల్ సమీపంలో జరిగిన సమావేశంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతు వాపపక్ష నాయకులను గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. ఈ సభలో వాయపక్ష నాయకులు, డిఎంకె, విసికె పార్టీల నుండి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ బిల్లు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** : డీలిమిటేషన్ బిల్లు 2026 ముసాయిదాపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు రాష్ట్రాల ప్రస్తుత జనాభా నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోకుండా లోక్‌సభలో ప్రాతినిధ్యాన్ని నిర్ణయించే ప్రయత్నం చేస్తుందని ఆయన సోషల్ మీడియా ఎక్స్‌లో బుదవారం పేర్కొన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని,1976 జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని,మరోవైపు, జనాభా నియంత్రణ చర్యలలో వెనుకబడిన రాష్ట్రాలకు వారి అసమర్థ అమలుకు బహుమతి లభించినట్లు అవుతుందని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్ ప్రక్రియలో రాష్ట్రాల ప్రస్తుత జనాభా వాటాను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు సాగాలని బిజెపి ప్రభుత్వం భావిస్తుంది. ఇది కేరళ వంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. మన రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో సమాఖ్య వ్యవస్థను విడదీయరాని భాగంగా గుర్తించింది, సమాఖ్య ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యానికి కేవలం సంఖ్యలు మాత్రమే ఆధారం కాకూడదని విజయన్ తేల్చి చెప్పారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా ప్రభావితమయ్యే అందరి భావాలను, ముఖ్యంగా రాష్ట్రాల భావాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విధానం ఉండాలని ఆయన సూచించారు. ఈ విషయంలో ఏకాభిప్రాయ విధానం అత్యవసరం అని ఆయన అన్నారు. లోక్‌సభలో సీట్ల సంఖ్యను పెంచడానికి ప్రస్తుతం తొందరపాటుతో తీసుకువస్తున్న సవరణ, మన రాజ్యాంగ నిర్మాణానికి మూలస్తంభమైన ఏకాభిప్రాయ స్ఫూర్తిని నిస్సందేహంగా నాశనం చేస్తుందని ఆయన హెచ్చరించారు..

## 'డీలిమిటేషన్'ను వ్యతిరేకిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువస్తున్న డీ లిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును వ్యతిరేకించాలని ఇండియా వేదిక పార్టీలు నిర్ణయించా యి. రాజ్యసభలో ప్రతిపక్షనేత,ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో బుధవారం సాయంత్రం ఇండియా వేదిక పార్టీ నేతల సమావేశం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలతో పాటు, డీ లిమిటేషన్, మహిళారిజర్వేషన్ల బిల్లు అంశాలను చర్చించాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను తీసుకువస్తున్నట్లు సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ డీ లిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియా వేదిక పార్టీలు పార్లమెంటులో ఐక్యంగా పోరాడుతాయని చెప్పారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్ విభజన నిర్ణయం తీసుకుందని అన్నారు. తొలుత జనగణన పూర్తి చేయాలని, కొత్త జనాభా లెక్కల ఆధారంగానే డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేసమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా వేదిక అనుకూలంగా ఉందని, దానిని వ్యతిరేకించడం లేదని అన్నారు.

## సముద్రంలో పడవ బోల్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుంచి బయలుదేరిన పడవ మలేషియాకు వెళ్తుండగా, సముద్రంలో పడవ బోల్తా పడటంతో 250 మంది గల్లంతయ్యారు. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ జాతీయులు ఈ పడవలో ఉన్నారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి ఈ నెల 4న బయలుదేరినట్లు తెలిపింది. కాక్స్ బజార్‌లోని శరణార్థులు మలేషియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు పేర్కొంది. 2017లో మయన్మార్ సైన్యం మారణహోమం నేపథ్యంలో అక్కడి నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాటపడుతున్నారు.

## ఇరాన్‌లో 1,104 గంటలుగా ఇంటర్నెట్ నిలిపివేత

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా- ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇరాన్ అతలాకుతలమవుతుంది. యుద్ధం ప్రారంభమై 47 రోజులవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,104 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ నిలిచిపోయింది. దీంతో ప్రజలకు అంతర్జాతీయ కనెక్టివిటీ లేకుండా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ మేరకు ఇంటర్నెట్ పర్యవేక్షక సంస్థ నెట్ బ్లాక్ తెలిపింది. ఇరాన్‌పై దాడులకు పాల్పడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జనవరిలో హెచ్చరించాడు. ఆ నేపథ్యంలోనే డిజిటల్ సదుపాయం క్షీణించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం వల్ల అప్పటి నుంచి పూర్తిగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అంతర్గత నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నప్పటికీ.. అంతర్జాతీయ డిజిటిల్ సేవలకు అంతరాయమేర్పడింది.

## హార్ముజ్ సంఘర్షణతో
## ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం

**హైదరాబాద్ పెన్ పవర్:** హార్ముజ్ జలసంధి సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభానికి దారితీయవచ్చని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ)హెచ్చరించింది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో తలెత్తిన సంఘర్షణను త్వరితగతిన పరిష్కరించకపోతే, ఆహార సంక్షోభం మరింత తీవ్రతరం కావచ్చని మంగళవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన హెచ్చరించింది. ఈ పరిస్థితిని నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చింది. వ్యూహాత్మక మార్గమైన హార్ముజ్ జలసంధిపై 'తక్షణమే అమల్లోకి వచ్చే ' నావికా దిగ్బంధనాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ప్రకటన అనంతరం ఎఫ్ఎఒ ఈ ప్రకటనను విడుదల చేసింది. నావికా దిగ్బంధనంతో కీలకమైన సరఫరా గొలుసులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు గణనీయమైన ముప్పు ఎదురవుతుందని హెచ్చరించింది. ఈ ఏడాది చివరలో ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగే ప్రమాదాన్ని నివారించడానికి, అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లే నౌకలను వీలైనంత త్వరగా సముద్ర మార్గం మీదుగా వెళ్లేందుకు అనుమతించాలని ఎఫ్ఎఒ పేర్కొంది. ఆహార సంక్షోభం కొవిడ్ మహమ్మారి సమయంలో ఎదుర్కొన్న మాదిరిగా ఉండవచ్చని హెచ్చరించింది. ఒకదాని తర్వాత ఒకటి వచ్చే ప్రభావాల నుండి ప్రపంచ ఆహార వ్యవస్థను కాపాడటానికి అంతర్జాతీయ సహకారం అత్యవసరమని ఎఫ్ఎఒ స్పష్టం చేసింది.కీలకమైన వ్యవసాయ ? ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో 20 నుండి 45 శాతం వరకు హార్ముజ్ జలసంధి రవాణాపైనే ఆధారపడి ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన మార్గమైన ఈ జలసంధి ప్రస్తుతం భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా మారింది. ఇది, అత్యవసర వ్యవసాయ వస్తువుల కోసం ఇప్పటికే ఉన్న వాణిజ్య మార్గాలను సైతం దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# అప్పుల ఊబిలో ప్రపంచం




అభివృద్ధి చెందిన, చెందుతున్న ఆర్థికవ్యవస్థలలో ద్రవ్యపరమైన ఒత్తిళ్లు తీవ్రమవుతున్నందున, ప్రపంచ దేశాల అప్పులు ఆందోళనకర స్థాయికి పెరగనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) హెచ్చరించింది. 2029 నాటికి ఇది ప్రపంచ జీడీపీలో 100 శాతానికి చేరవచ్చని అంచనా చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులు క్రమంగా క్షీణిస్తున్నాయి. 2025 నాటికే ప్రపంచ రుణం జీడీపీలో సుమారు 94 శాతానికి చేరింది. నిరంతర లోటు, పెరిగిన వడ్డీ ఖర్చులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దీనికి ప్రధాన కారణాలని ఐఎంఎఫ్ పేర్కొంది. అవి ఇంకా పెరుగుతూనే ఉంటాయని అంచనా. ఇటీవలి పశ్చిమాసియా ఘర్షణలు, భౌగోళిక సమస్యలు ఇంధన ధరలను పెంచి ప్రపంచ ఆర్థిక పరిస్థితులను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహార, ఇంధన ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ముఖ్యంగా దిగుమతి ఆధారిత, తక్కువ ఆదాయ దేశాలపై ఎక్కువగా పడుతోంది. తద్వారా ఈ దేశాలు అధిక ఖర్చులు, పరిమిత ఆర్థిక వెసులుబాటు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అయితే, ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్‌తో పాటు మెక్సికో, టర్కీ వంటి దేశాలు కొంత మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్నాయి. భారత్‌లో ఖర్చుల నియంత్రణ సరిగ్గానే ఉందని, అత్యంత పటిష్టమైన వృద్ధి ఇందుకు కారణమని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. భారత రుణ–జీడీపీ నిష్పత్తి ఇంకా 84 శాతం కంటే ఎక్కువగా ఉంది. మనదేశం తర్వాత మధ్యస్థంగా అప్పుల భారం ఉన్న దేశాల్లో బ్రెజిల్(90 శాతం), చైనా(100 శాతం), యూకే(105 శాతం), కెనడా(105 శాతం), స్పెయిన్(110 శాతం) ఉన్నాయి. అంతర్జాతీయ సంక్షోభాలు కొనసాగితే ఇంధన ధరలు, నిధులు, ఆర్థిక నిర్వహణపై ఒత్తిడి పెరుగుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. గత దశాబ్దంతో పోలిస్తే అదనంగా డబ్బు ఖర్చు చేయడానికి లేదా అప్పు తీసుకోవడానికి ఉన్న సామర్థ్యం ప్రపంచ దేశాల్లో చాలా తగ్గిపోయింది. ప్రస్తుతం చాలా దేశాలు అధిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకోవాల్సి వస్తోంది, దీంతో వడ్డీ భారం వేగంగా పెరుగుతోంది. జపాన్(జీడీపీలో 240 శాతం అప్పుల భారం), సింగపూర్(180 శాతం), గ్రీస్(170 శాతం), ఇటలీ(145 శాతం), అమెరికా(125 శాతం) దేశాలు భారీ అప్పులను ఎదుర్కొంటున్నాయి. రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ, ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు 20–65 శాతం మధ్య తక్కువ రుణాలు కలిగి ఉన్నాయి.

# రాటెత్తిన టోకు ధరలు




దేశంలో ధరలు రాటెత్తుతు సామాన్యుడి నడ్డి విరుస్తోన్నాయి. ఈ ఏడాది మార్చిలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 4 శాతం చేరువకు ఎగిసింది. ఇది గత మూడేళ్లలోనే అత్యధికంగా కావడం ఆందోళకరం. బుధవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చిలో డబ్ల్యుపిఐ 3.88 శాతానికి చేరింది. ఇది 38 నెలల గరిష్ట స్థాయి. ఇంతక్రితం ఫిబ్రవరిలో 2.13 శాతంగా ఉన్న ఈ ధరల సూచీ.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా ఎగబాకడం తీవ్ర ఆందోళనకరం. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడమే దీనికి ప్రధాన కారణమని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. మార్చి నెలలో ముడి చమురు ధరలు ఏకంగా 51.57 శాతం మేర పెరగడమే ధరల మంటకు ప్రధాన కారణం. ఇది సామాన్యుడి రవాణా బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేసింది. గత ఏడాది కాలంగా ప్రతికూల దిశలో ఉన్న ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బణం ఇప్పుడు 1.05 శాతానికి చేరడం భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయనడానికి హెచ్చరికగా మారింది. సామాన్యుడు ఎక్కువగా ఉపయోగించే నూనె గింజల ద్రవ్యోల్బణం 22.81 శాతం పెరగడం గమనార్హం. దీంతో వంట నూనెల ధరలు భారంగా మారాయి. డబ్ల్యుపిఐలో 64 శాతానికి పైగా వాటా ఉన్న తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మార్చిలో 3.39 శాతానికి చేరుకుని 40 నెలల గరిష్ట స్థాయి కావడం గమనార్హం. ఫిబ్రవరిలో ఇది 2.92 శాతంగా ఉంది. ఇదే నెలలో 3.21 శాతంగా ఉన్న రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం.. మార్చిలో ఇంధన ధరల పెరుగుదల కారణంగా 3.4 శాతానికి పెరిగింది. మరోవైపు వినియోగదారుల ధరల సూచీ 3.40 శాతానికి చేరింది. ఆదాయాలు హరించుకుపోతున్న తరుణంలో అధిక ధరల వల్ల సామాన్యుడి వాస్తవ ఆదాయం తగ్గుముఖం పడుతోంది. దీంతో గతంలో వంద రూపాయలకు వచ్చే సరుకులు ఇప్పుడు సగం కూడా రావడం లేదు. వర్షాభావ పరిస్థితులు గనుక తలెత్తితే ఆహార వస్తువుల ధరలు పెరిగి వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 5 శాతం దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరలను ప్రభుత్వం అదుపు చేయకపోతే అనేక కుటుంబాలు తన దైనందిన అవసరాల కోసం అప్పులు చేయక తప్పని స్థితి ఏర్పడుతుందని విశ్లేషిస్తున్నారు. ఆదాయం పెరగక పోగా.. ఖర్చులు మాత్రం గరిష్ట స్థాయికి చేరడం దేశంలోని మధ్యతరగతి ప్రజల ఆర్థిక పునాదులను దెబ్బతీయనుందని విశ్లేషిస్తున్నారు.

# ఎల్ఐసీ సరికొత్త స్మార్ట్ సేవలు




ప్రభుత్వ దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) తమ పాలసీదారులకు మరింత మెరుగైన, స్మార్ట్ సేవలను అందించడానికి తన డిజిటల్ సేవలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. బుధవారం ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి త్వ శాఖ కార్యదర్శి ఎం. నాగరాజు వినియోగదారుల కోసం 'మైఎల్ఐసీ' యాప్‌ను, సేల్స్ ఏజెంట్ల కోసం 'సూపర్ సేల్స్ సాథీ' యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. "ఎల్ఐసీ డిజిటల్ వ్యవస్థ కేవలం సేవా సౌకర్యంగానే కాకుం డా, వ్యూహాత్మక పంపిణీ వేదికగా మారుతోంది. 26 కోట్ల పాలసీలతో దేశవ్యాప్తంగా విస్తరించిన ఎల్ఐసీకి ఈ మొబైల్ యాప్‌లు సేవా సామర్థ్యాన్ని పెంచ డంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆకాంక్షించారు.

మొబైల్ యాప్‌లు ఇకపై కేవలం సహాయక సాధనాలు మాత్రమే కావు.. ఇవి కస్టమర్ అనుభవాన్ని, పాలసీ విక్రేతల పనితీరును నిర్దేశించే వ్యూహాత్మక ఆస్తులు" అని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి పేర్కొన్నారు. మైఎల్ఐసీ యాప్ ద్వారా పాలసీదారులు ప్రీమియం చెల్లింపులు, పేపర్‌లెస్ లోన్ వంటి సేవలు పొందవచ్చు. సూపర్ సేల్స్ సాథీ యాప్ ఏజెంట్లకు డిజిటల్ సేల్స్ టూల్స్, ఏఐ ఆధారిత కస్టమర్ గైడెన్స్‌ను అందిస్తూ వారి ఉత్పాదకతను పెంచనుందని ఎల్ఐసీ వర్గాలు తెలిపాయి. ఈ వినూత్న యాప్‌లు ఎల్ఐసీ సేవలను మరింత వేగవంతం చేస్తూ, కార్యాలయాలపై ఆధారపడటాన్ని భారీగా తగ్గిస్తాయని వెల్లడించాయి.

# ట్రంప్ కీలక ప్రకటన ? భారీ లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కీలక ప్రకటనతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో త్వరలోనే అమెరికా?ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరిగే అవకాశముందని ఆయన వెల్లడించడంతో పెట్టుబడిదారుల్లో సానుకూల భావనలు నెలకొన్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో దేశీయ సూచీలు గణనీయంగా పెరిగాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే బిఎస్ఈ సెన్సెక్స్ 1,200 పాయింట్లకు పైగా ఎగిసి 78,000 స్థాయిని దాటగా, నిఫ్టీ 50 కూడా 350 పాయింట్లకు పైగా ద
లాభపడి 24,200 మార్క్ వద్ద కొనసాగింది. సూచీలోని పలు ప్రధాన కంపెనీల షేర్లు బలంగా రాణించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కూడా మార్కెట్లకు ఊరటనిచ్చాయి. హర్మూజ్ సముద్ర మార్గంపై ఉద్రిక్తతల నేపథ్యంలో ఏర్పడిన ఆందోళనలు తగ్గుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లోకి మళ్లాయి. అదే సమయంలో ఃతీవనిబి అతీబీటవ ధర బ్యారెల్‌కు 95 డాలర్ల దిగువకు చేరుకోవడం కూడా పెట్టుబడిదారులకు ధైర్యం ఇచ్చింది. ఈ పరిణామాల సమ్మిళిత ప్రభావంతో దేశీయ మార్కెట్లు నేటి ట్రేడింగ్‌లో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి.

# వరుసగా మూడో రోజు పెరిగిన ధరలు



హైదరాబాద్‌లో వరుసగా బంగారం ధరలు పెరిగిపోయాయి. పెరిగిన ధరలు పసిడి ప్రియులకు షాక్ ఇస్తూ.. పై పైకి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, దేశీయంగా పెరిగిన డిమాండ్ నేపథ్యంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో వరుసగా మూడో రోజు కూడా బంగారం ధరలు పెరిగాయి. గత మూడు రోజుల్లోనే తులం బంగారంపై మూడు వేల రూపాయలకు పైగా పెరుగుదల నమోదు కావడం గమనార్హం. ఈ రోజు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) నేడు రూ.220 పెరగడంతో, తులం బంగారం ధర రూ.1,55,570 కు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.200 పెరిగింది దీంతో దీని ధర రూ.1,42,600 గా నమోదైంది. గత మూడు రోజులుగా బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మొత్తంగా ఈ మూడు రోజుల్లోనే 24 క్యారెట్ల బంగారంపై రూ.3,110 పెరుగుదల కనిపించింది. 22 క్యారెట్ల బంగారం రూ.2,850 మేర ధర పెరిగింది. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు స్టాక్ మార్కెట్లలోని అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతుండటమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తుండటంతో సామాన్య ప్రజలపై ఈ ధరల భారం మరింత పడే అవకాశం ఉంది.

# భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా



ఈ ఏడాది మార్చితో ముగిసిన 2025–26 ఆర్థిక సంవత్సరంలో అమెరికాను దాటి చైనా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరించింది. ఈ కాలంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 151.1 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 14.09 లక్షల కోట్ల)కు చేరుకోగా, చైనాతో మనదేశ వాణిజ్య లోటు 112.16 బిలియన్ డాలర్లకు పెరిగిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గత 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు వరుసగా నాలుగేళ్ల పాటు అమెరికానే భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. కానీ, గతేడాదిలో చైనాకు భారత ఎగుమతులు 36.66 శాతం పెరిగి 19.47 బిలియన్ డాలర్ల(1.81 లక్షల కోట్ల)కు చేరుకోగా, దిగుమతులు 16 శాతం పెరిగి 131.63 బిలియన్ డాలర్ల(12.27 లక్షల కోట్ల)కు చేరాయి. 2024–25లో 99.2 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు, 2025–26 నాటికి చారిత్రాత్మక గరిష్ఠం 112.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. మరోవైపు, అమెరికాకు మన ఎగుమతులు 0.92 పెరిగి 87.3 బిలియన్ డాలర్లకు, దిగుమౌలు 15.95 శాతం పెరిగి 52.9 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 40.89 బిలియన్ డాలర్ల నుంచి 34.4 బిలియన్ డాలర్లకు తగ్గిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# భారీగా తగ్గిన వాణిజ్య లోటు




దేశీయ వాణిజ్య లోటు గత నెలలో గణనీయంగా దిగొచ్చింది. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల ఎగుమతులకు ఆటంకం ఉండవచ్చని, ఇంధనంతో పాటు ఇతర దిగుమతుల ధరలు పెరగవచ్చనే ఆందోళలు ఉన్నప్పటికీ మార్చి నెలలో భారత వాణిజ్య లోటు 20.67 బిలియన్ డాలర్ల(రూ. 1.93 లక్షల కోట్ల)కు తగ్గిందని ప్రభుత్వ గణాంకాలు బుధవారం వెల్లడించాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, వస్తు ఎగుమతులు అంతకుముందు నెలలో 36.61 బిలియన్ డాలర్ల నుంచి మార్చిలో 38.92 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇదే సమయంలో, దిగుమతులు మాత్రం 63.71 బిలియన్ డాలర్ల నుంచి 59.59 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఎగుమతులు పెరగడం, దిగుమతులు క్షీణత పరిణామాలతో వాణిజ్య లోటు క్షీణించిందని నిపుణులు తెలిపారు. ఇరాన్–గల్ఫ్ ప్రాంతాల్లో యుద్ధ పరిస్థితుల కారణంగా ఆయిల్ సరఫరా, వాణిజ్య మార్గాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ముఖ్యమైన హోర్ముజ్ జలసంధి సమస్యలు ఇంధన రవాణాకు ఆటంకం కలిగించవచ్చని భావిస్తున్నారు. మనదేశం గల్ఫ్ దేశాల షిప్పింగ్ మార్గాలపై ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ పరిస్థితుల్లో రవాణా, బీమా ఖర్చులు పెరగడం వల్ల వాణిజ్య ఖర్చులు మరింత ప్రమాదకరంగా మారవచ్చు. ఈ పరిస్థితులు భవిష్యత్తు దిగుమతులు, ఎగుమతులపై ప్రభావం చూపవచ్చు.

# పుచ్చకాయ తింటూ గింజలు మింగేశారా?



వేసవిలో అధికంగా లభించే పుచ్చకాయలు రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి రుచిగా ఉండటమేకాకుండా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎన్నో విధాలుగా సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి పుచ్చకాయ తినడం తప్పనిసరి. తీవ్రమైన వేడిలో శరీరాన్ని తాజాగా ఉంచడానికి పుచ్చకాయ కంటే మంచిన మరో ప్రత్యామ్నాయం లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఐరన్ కూడా పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయలో కేలరీల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల మధుమేహ రోగులు కూడా పుచ్చకాయ హాయిగా తినవచ్చు. కాబట్టి ఎండ వేడిమికి చర్మం కమిలిపోకుండా ఉండాలంటే తియ్యని పుచ్చకాయ ముక్కలు తినాల్సిందే. ఫలితంగా మీ శరీరం ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. పుచ్చకాయ మాత్రమే కాదు పుచ్చకాయ గింజలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది పుచ్చకాయ తినేటప్పుడు పొరపాటున గింజలను మింగేస్తుంటారు. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. నిజానికి ఇది పొరపాటు కాదని నిపుణులు చెబుతున్నారు. పైగా పుచ్చకాయ గింజలను నేరుగా కూడా తినవచ్చు. పుచ్చకాయ గింజలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా పుచ్చకాయ గింజలు ఆహారం త్వరగా జీర్ణం కావడానికి కూడా సహాయపడతాయి. చర్మంపై ముడతలను తగ్గించడానికి లేదా చర్మపు కాంతిని పెంచడానికి పుచ్చకాయ గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. పుచ్చకాయ ముక్కలుగా కట్ చేసి, దాని గింజలను వేరు చేయాలి. ఆ తర్వాత దానిని ఎండలో ఆరబెట్టి, పొడి పెనంలో వేయించాలి. ఈ గింజలను నేరుగా నమిలి తినవచ్చు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత లేదా భోజనం తర్వాత తినవచ్చు. బరువు తగ్గాలనుకునేవారు మధ్యాహ్నం పూట చిరుతిండిగా పుచ్చకాయ గింజలను తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఆకలి తక్కువగా అనిపించి, వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే అన్నంతో పాటు పుచ్చకాయ గింజలను కూడా తినవచ్చు. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

# కొబ్బరి నీళ్లలో ఈ గింజలు వేసుకుని తాగితే అమృతమే..




ఉదయం ఎనిమిది దాటిందంటేనే సూర్యుడు సెగలు గక్కుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, విపరీతమైన చెమట మనలోని శక్తిని నిలువునా లాగేస్తున్నాయి. కేవలం నీళ్లు తాగినా తీరని దాహం.. ఇలాంటి తరుణంలో కోల్పోయిన శక్తిని తిరిగి ఇచ్చే ఎలక్ట్రోలైట్లు, శరీరాన్ని లోపలి నుండి చల్లబరిచే ఔషధం కావాలి. అదే కొబ్బరి నీరు – సబ్జా గింజల అద్భుత కలయిక. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి తీవ్రత పెరగడంతో అధిక చెమట, తీవ్రమైన అలసట, నీరసం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి నీరు, చలువ చేసే సబ్జా గింజల మిశ్రమంతో ఈ సమస్యలకు సులువుగా చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్‌కు అద్భుత పరిష్కారం: ఎండల వల్ల శరీరంలోని ఎలక్ట్రోలైట్లు వేగంగా తగ్గిపోతాయి. కొబ్బరి నీటిలో ఉండే పొటాషియం, సోడియం, మెగ్నీషియం శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. వీటికి సబ్జా గింజలను జత చేస్తే, అవి నీటిని పీల్చుకుని జెల్ లాగా మారి, శరీరంలో ఎక్కువ సేపు తేమను నిలుపుతాయి. తద్వారా అలసట మాయమై, శరీరం రీఛార్జ్ అవుతుంది. జీర్ణక్రియకు రక్షణ కవచం: వేసవిలో వచ్చే గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు ఈ పానీయం ఒక దివ్యౌషధం. సబ్జా గింజల్లో ఉండే అధిక పీచుపదార్థం పేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొబ్బరి నీరు కడుపులోని మంటను తగ్గించి, ఎసిడిటీని నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి వరం: ఊబకాయం లేదా అధిక బరువుతో బాధపడేవారికి ఇది ఉత్తమ ఎంపిక. సబ్జా గింజలు తీసుకున్నప్పుడు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి, దీనివల్ల అతిగా తినే అలవాటు తగ్గుతుంది. కొబ్బరి నీటిలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉండదు. చర్మ సౌందర్యం.. రెట్టింపు శక్తి: ఈ మిశ్రమం కేవలం ఆరోగ్యానికే కాదు చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడం ద్వారా చర్మం కాంతివంతంగా మారుతుంది. మధ్యాహ్న సమయంలో ఈ పానీయం తీసుకోవడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాబట్టి కూల్ డ్రింక్స్, సోడాల వంటి కృత్రిమ పానీయాల కంటే.. సహజసిద్ధమైన ఈ కొబ్బరి నీరు–సబ్జా గింజల మిశ్రమాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు.

# ఈ పండ్లు తిన్నారంటే రోజంతా ఫుల్ ఖుష్



వేసవిలో చాలా మందికి నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో మండే ఎండలు త్వరగా శక్తిని కోల్పోయేలా చేస్తాయి. దీంతో నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో వచ్చే ఈ సమస్య నుంచి బయటపడటానికి అధిక నీటితో పాటు కొన్ని రకాల పండ్లను కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పండ్లను తినడం ద్వారా శరీరంలో తగినంత నీటి శాతాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. నారింజ పండ్లు నీరు అధిక శాతం ఉండే పండ్లు. వీటిల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వీటిలోని అధిక నీటి శాతం వేడి వాతావరణంలో శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. అంతేకాకుండా వాటిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో డీహైడ్రేషన్‌ను నివారించడానికి, శరీరంలో నీటి శాతాన్ని నిలుపుకోవడానికి పుచ్చకాయలను తినడం మంచి ఎంపిక. ఇందులో 92 శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది వేసవికి అనువైన పండు. ఇది శరీరానికి తేమను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. స్ట్రాబెర్రీలు తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా వాటిలో మంచి మొత్తంలో నీరు కూడా ఉంటుంది. విటమిన్ సిచ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల స్ట్రాబెర్రీలు శరీరాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుంచి, వేడి నుంచి కాపాడతాయి. వేసవిలో దొరికే సీజనల్ పండ్లలో పనస ముఖ్యమైనది. ఇది మంచి సువాసనతో పాటు ఎన్నో మేలు చేసే పోషకాలు దండిగా కలిగి ఉంటుంది. తినడానికి ఈ పండు రుచికరంగా ఉండటమే కాకుండా, శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అంతేకాకుండా అనాస పండులో మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. కీరదోసలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. కాబట్టి ఈ వేసవిలో ప్రతిరోజూ కీరదోస సలాడ్, లేదా జ్యూస్ ఎలా తీసుకున్నా మంచిదే.

# ఏ విటమిన్ ఏ వ్యాధి నుంచి రక్షిస్తుంది..?




విటమిన్లు అనేవి శరీరంలోని దాదాపు అన్ని విధులలో కీలక పాత్ర పోషించే ఆవశ్యక పోషకాలు. వాటి లోపం అనేక సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల, ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయో అర్థం చేసుకోవడం ముఖ్యం. విటమిన్లు శరీరానికి అవసరమైన పోషకాలు.. ఇవి మన మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరానికి శక్తిని అందించడానికి, అవయవాల సరైన పనితీరును నిర్వహించడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ప్రతి విటమిన్‌కు ఒక ప్రత్యేకమైన పని ఉంటుంది.. ఉదాహరణకు ఎముకలను బలోపేతం చేయడం.. మరికొన్ని చర్మ, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. శరీరం చాలా విటమిన్లను స్వయంగా ఉత్పత్తి చేసుకోలేదు. కాబట్టి వాటిని ఆహారం ద్వారా పొందడం చాలా అవసరం. ఈ విటమిన్ల లోపం వివిధ ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత మోతాదులో విటమిన్లను తీసుకోవడం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, అనేక వ్యాధులను నివారిస్తుంది.. శరీర పనితీరును మెరుగుపరుస్తుంది. అందువల్ల, సమతుల్య ఆహారంలో విటమిన్లను చేర్చడం చాలా కీలకం. ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి.. ఎముకలు, కండరాల బలానికి విటమిన్ డి, బి12 చాలా అవసరం.. అవి బలాన్ని అందించి, బలహీనత,

ఎముకలకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. విటమిన్ ఎ, విటమిన్ ఇ దృష్టి, చర్మ ఆరోగ్యాన్ని

కాపాడటానికి సహాయపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, కళ్ళను రక్షించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. గుండె, మెదడు సరిగ్గా పనిచేయడానికి విటమిన్ బి6, బి12 చాలా అవసరం. అవి రక్త ప్రసరణను మెరుగుపరిచి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. విటమిన్ లోపాలను గుర్తించడానికి నిర్దిష్ట రక్త పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్ ప్రొఫైల్, కాల్షియం పరీక్షలు ఉంటాయి. మీ లక్షణాల ఆధారంగా వైద్యులు తగిన పరీక్షలను సిఫార్సు చేస్తారు. ఒక వ్యక్తికి తరచుగా అలసట, నీరసం, జుట్టు రాలడం లేదా చర్మ సమస్యలు వంటివి కనిపిస్తే, అది విటమిన్ లోపానికి సంకేతం కావచ్చు. క్రమం తప్పని వైద్య పరీక్షలు ఈ పరిస్థితిని నిర్ధారించి, తగిన చికిత్సను ప్రారంభించడానికి సహాయపడతాయి.

# బూడిద గుమ్మడి కాయ జ్యూస్ తాగుతున్నారా?



ఈ మధ్యకాలంలో బూడిద గుమ్మడికాయ జ్యూస్ ట్రెండింగ్‌లో ఉంది. చాలామంది ఉదయాన్నే పడిగడుపున దీనిని తాగుతున్నారు. అయితే.. బూడిద గుమ్మడి జ్యూస్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి కూరగాయల జ్యూస్‌లలో ఉండే ఆక్సిలేట్‌లు ఈ సమస్యకు కారణం కావచ్చు. యాంటీ–న్యూట్రియంట్‌లను తగ్గించడానికి ఉడకబెట్టి తాగడం ఉత్తమం. బూడిద గుమ్మడికాయ జ్యూస్ ఈ మధ్యకాలంలో చాలా ట్రెండీగా మారింది. ఆరోగ్యం కోసం చాలామంది దీన్ని ఉదయాన్నే పడిగడుపున తాగుతున్నారు. అయితే, దీని వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, సురక్షితమైన వినియోగం గురించి అవగాహన ఉండటం చాలా ముఖ్యమంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అన్ని కూరగాయలలో యాంటీ–న్యూట్రియంట్స్ ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ఇవి శరీరంలో విటమిన్ శోషణ, జీర్ణక్రియను ప్రభావితం చేయవచ్చు. బూడిద గుమ్మడికాయలో ఆక్సిలేట్స్ అనే యాంటీ–న్యూట్రియంట్ అధికంగా ఉంటుంది. సుమారు 300–400 గ్రాముల బూడిద గుమ్మడికాయ ముక్కల నుండి తీసిన 200–300 ఎఁశ్రీ పచ్చి జ్యూస్‌లో ఆక్సిలేట్ల సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అధిక ఆక్సిలేట్ కంటెంట్ మనం ఆహారం ద్వారా తీసుకునే కాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాన్ని పెంచుతుందని పేర్కొంటున్నారు. ఇది అందరికీ రాకపోయినా, కొంతమందిలో ఆరోగ్య సమస్యలను సృష్టించగలదు. అందుకే, పడిగడుపున పచ్చి జ్యూస్ తాగడం అనేది అందరికీ సరైనది కాదని హెచ్చరిస్తున్నారు.

ఆక్సిలేట్ కంటెంట్‌ను తగ్గించడానికి బూడిద గుమ్మడికాయను ఉడకబెట్టి లేదా కొద్దిగా వేగించి జ్యూస్ చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఇలా చేయడం వల్ల దానిలోని యాంటీ–న్యూట్రియంట్ ప్రొఫైల్ తగ్గి, విటమిన్లు ? ఖనిజాలు శరీరానికి మంచిగా అందుతాయి. పచ్చి కూరగాయల జ్యూస్‌లు దీర్ఘకాలంలో చెడు ప్రభావాలు చూపవచ్చని పేర్కొంటున్నారు.. శరీరాన్ని డిటాక్స్ చేస్తుందని చెప్పి అనేక రకాల జ్యూస్‌లను ప్రచారం చేస్తున్నారు. అయితే, కిడ్నీలు, లివర్, లింఫాటిక్ సిస్టం, చర్మం వంటి మన శరీర అవయవాలు సహజంగానే శరీరాన్ని డిటాక్స్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డిటాక్స్ జ్యూస్‌లు అనేది ఒక స్కామ్ అని, శరీరానికి నిజంగా ఏదైనా సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని, జ్యూస్‌లు తాగడం వల్ల లాభం లేదని సూచిస్తున్నారు. సరైన జీవనశైలి, అంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ద్వారా శరీరం దాని డిటాక్సిఫికేషన్ ప్రక్రియను సమర్థవంతంగా చూసుకుంటుందని గుర్తుచేస్తున్నారు. చాలా మంది జ్యూస్ తాగిన వెంటనే చురుకుగా ఉన్నట్లు భావిస్తారని, అది కేవలం శరీరానికి లభించే విటమిన్లు ? ఖనిజాల తాత్కాలిక ప్రభావం మాత్రమేనని పేర్కొంటున్నారు.

# పేపర్ కప్‌లు వాడటం ఆరోగ్యానికి మంచిదనుకుంటున్నారా?

నేటి ఆధునిక జీవనశైలిలో కాఫీ, టీ తాగే అలవాట్లు కూడా మారిపోయాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడు లేదా ఆఫీసు పనుల మధ్యలో చాలామంది పేపర్ గ్లాసులను వాడటం ఒక ఫ్యాషన్‌గా, సౌకర్యంగా భావిస్తున్నారు. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఒక 'సైలెంట్ కిల్లర్'లా మారుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం చూసే పేపర్ కప్పులు కేవలం కాగితంతోనే తయారవ్వవు. అవి తడవకుండా ఉండటానికి వాటి లోపలి భాగంలో ఒక సన్నని ప్లాస్టిక్ పొరను ఉపయోగిస్తారు. వేడి వేడి టీ లేదా కాఫీ ఆ కప్పులో పోసినప్పుడు, ఆ వేడికి ప్లాస్టిక్ కరిగి ప్రమాదకరమైన రసాయనాలు పానీయంలో కలిసిపోతాయి. కాగితం కప్పులలో ఉండే అత్యంత సన్నని ప్లాస్టిక్ పొరను మైక్రోప్లాస్టిక్స్ అంటారు. వేడి కాఫీ లేదా టీతో ఈ ప్లాస్టిక్ పొరలోని రసాయనాలు కలిసిపోయి నేరుగా మన జీర్ణవ్యవస్థలోకి చేరుతాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం ఇవి రక్తంలోని హార్మోన్ల వ్యవస్థను దెబ్బతీసి రక్తప్రసరణకు ఆటంకంగా మారుతాయి. దీనివల్ల కీళ్ల నొప్పులు, జీర్ణకోశ వ్యాధులు, చివరికి క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ఈ రసాయనాల ప్రభావం వెంటనే కనిపించకపోయినా, శరీరంలో పేరుకుపోవడం వల్ల దీర్ఘకాలంలో కోలుకోలేని ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. కేవలం పేపర్ కప్పులే కాదు, కర్రీ పాయింట్స్ నుండి వేడి కూరలను ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ తీసుకెళ్లడం కూడా అంతే ప్రమాదకరం. వేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్లతో స్పర్శించినప్పుడు ప్లాస్టిక్‌లోని హానికర కారకాలు ఆహారంలో కలిసిపోతాయి. ఇవి శరీరంలో చేరి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేవలం మానవ ఆరోగ్యానికే కాదు, భూమిపై ఉండే పర్యావరణానికి కూడా పెను సవాలుగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి వందల ఏళ్లు పడుతుంది, ఇది భవిష్యత్తు తరాలకు తీరని నష్టం కలిగిస్తుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. వీలైనంత వరకు గాజు, స్టీల్ లేదా సిరామిక్ కప్పులను వాడటం ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. బయటకు వెళ్లే సమయంలో మీ సొంత రీయూజబుల్ కప్పును వెంట తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. కాఫీ షాపుల్లో లేదా టీ స్టాళ్లలో పేపర్ కప్పులను నిరాకరించి, పర్యావరణ హితమైన మట్టి పాత్రలు లేదా స్టీల్ గ్లాసులను ఎంచుకోవడం ఉత్తమం. చిన్నపాటి మార్పులే మన ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా ఈ భూమిని పదిలంగా ఉంచుతాయి. పేపర్ కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్లను ఎంత త్వరగా మానుకుంటే అంత మంచిది. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.

# పంజాబ్ vs ముంబై మధ్య కీలక పోరు..

# ఏ జట్టు గెలుస్తుందో తెలుసా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో నేడు అసలైన మజా షురూ కానుంది! ఒకవైపు వరుస విజయాలతో 'అన్‌స్టాపబుల్'గా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్ , మరోవైపు తన సొంత గడ్డపై ఫామ్ కోసం వెతుకుతున్న ముంబై ఇండియన్స్ . ఈ రోజు రాత్రి ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ గత ఏడాది క్వాలిఫైయర్-- 2 పోరును గుర్తుకు తెస్తోంది.

**పిచ్ రిపోర్ట్:**

వాంఖడే పిచ్ ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామం.. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇరు జట్లు 220 పరుగుల మార్కును దాటాయి. గత మ్యాచ్‌లో ఇక్కడ 462 పరుగులు నమోదయ్యాయి. ఈ రోజు కూడా స్టేడియంలో బౌండరీల వర్షం కురిసే అవకాశం ఉంది. ఇక్కడ ఛేజింగ్ చేయడం సులభం కాబట్టి, టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

**విజేత ఎవరంటే!:**

ప్రస్తుత ఫామ్ ప్రకారం పంజాబ్ కింగ్స్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ జట్టు ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. పంజాబ్ ప్రస్తుతం 3 విజయాలతో 3వ స్థానంలో ఉండగా, ముంబై కేవలం ఒక్క విజయంతో 9వ స్థానంలో ఉంది. ఈ రోజు పంజాబ్ గెలిస్తే పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది.

**ముఖ్యమైన ఆటగాళ్లు:**

సూర్యకుమార్ యాదవ్: పంజాబ్‌పై సూర్యకు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు వారిపై 606 పరుగులు చేశాడు (స్ట్రైక్ రేట్ 156.58). వాంఖడేలో అతని స్ట్రైక్ రేట్ 187.50గా ఉండటం విశేషం. నేటి మ్యాచ్‌లో అతను టాప్ స్కోరర్‌గా నిలిచే అవకాశం ఉంది.

శ్రేయస్ అయ్యర్: పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. బుమ్రా బౌలింగ్‌లో అయ్యర్‌కు మంచి రికార్డు ఉంది (కేవలం ఒకసారి మాత్రమే అవుట్ అయ్యాడు).

**తుది జట్ల అంచనా:**

ముంబై ఇండియన్స్: ర్యాన్ రికెల్టన్, క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్),ం

సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, నమన్ ధీర్, మిచెల్ సాంట్నర్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, జస్ప్రీత్ బుమ్రా.

**ఇంపాక్ట్ ప్లేయర్: అశ్వని కుమార్**

పంజాబ్ కింగ్స్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కూపర్ కానలీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్లెట్, వైశాఖ్ విజయ్‌కుమార్, అర్ష్‌దీప్ సింగ్.

ఇంపాక్ట్ ప్లేయర్: యుజ్వేంద్ర చాహల్

# ఏకంగా స్టేడియంలోనే డ్యాన్స్ చేసిన రోహిత్ శర్మ..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా వాంఖడే స్టేడియంలో ఈరోజు పంజాబ్ కింగ్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మధ్య జరగనున్న కీలక మ్యాచ్ కి రంగం సిద్ధమైంది. ఇక మ్యాచుకి ముందు రోహిత్ శర్మకి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వాంఖడే స్టేడియంలో బుధవారం జరిగిన ఫిట్‌నెస్ డ్రిల్ సమయంలో రోహిత్ సరదాగా డ్యాన్స్ చేస్తూ కనిపించడం నెటిజన్లను తెగ ఆకట్టుకుంటోంది.

**రోహిత్ గాయంపై ఉత్కంఠ:**

గత ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ)తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో రోహిత్ శర్మ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఇక మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు కూడా అతను దూరంగా ఉండటంతో, పంజాబ్‌తో జరిగే కీలక మ్యాచ్‌లో రోహిత్ ఆడతాడా లేదా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ తాజాగా వైరల్ అయిన వీడియోలో రోహిత్ శర్మ తన మోకాళ్లను ఛాతీ వరకు ఎత్తుతూ చేసే వ్యాయామం (ఖీఱఅవంం ణతీఅశ్రీశ్రీ) చేస్తూ, మధ్యలో ఫన్నీగా డ్యాన్స్ చేయడం కనిపించింది. ఇది చూసి అభిమానులు మురిసిపోతున్నప్పటికీ, మరో అంశం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇక డ్యాన్స్ చేస్తున్న ఆ వీడియోలో రోహిత్ తన తొడ భాగంలో బ్యాండేజ్ చుట్టుకుని ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది.

**పంజాబ్ మ్యాచ్‌లో ఆడతాడా?:**

రోహిత్ శర్మ ప్రాక్టీస్‌లో హుషారుగా కనిపించినప్పటికీ, గాయం ఇంకా పూర్తిగా తగ్గలేదని ఆ బ్యాండేజ్ సూచిస్తోంది. ఒకవేళ ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకోవద్దని భావిస్తే, రోహిత్ స్థానంలో డానిష్ మలేవార్ లేదా రాబిన్ మింజ్ ఓపెనర్లుగా వచ్చే అవకాశం ఉంది. టాస్ పడే వరకు హిట్ మ్యాన్ తుది జట్టులో ఉంటాడో లేదో వేచి చూడాల్సిందే.

# సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ ఔట్.. ఆ మ్యాచ్‌కి కెప్టెన్ సాబ్ ఎంట్రీ




**హైదరాబాద్ పెన్ పవర్:** సన్ రైజర్స్ హైదరాబాద్ టీంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండో విజయం నమోదు చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ ఈ నెల 18న ఉప్పల్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌కు ముందు జట్టులో పలు మార్పులు చేసింది. జట్టులో కీలక ఆటగాడు గాయం కారణంగా దూరమయ్యాడు. ఆ స్థానంలో మరో బౌలర్ ఎంట్రీ ఇచ్చాడు. కాగా, ఇషాన్ కిషన్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకునే ఛాన్స్ ఉంది.

సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ గా కొనసాగుతున్న ఇషాన్ కిషన్ ఆ బాధ్యతల నుంచి తప్పుకొనే టైం వచ్చింది. ఇదే సమయంలో జట్టులోనూ మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ గాయంతో ఈ సీజన్ మొత్తానికే దూరం కాగా, అతడి స్థానంలో యాజమాన్యం శ్రీలంక యువ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ దిల్షాన్ మధుశంకను రూ. 75 లక్షలకు తుది జట్టులోకి తీసుకుంది. మధుశంక స్వింగ్ బౌలింగ్ తో బ్యాటర్లను ముప్ప తిప్పులు పెట్టగలడు. కాగా, ఫిట్‌నెస్ సమస్యలతో ఫస్ట్ హాఫ్ మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా తిరిగి జట్టులోకి వస్తున్నట్లు తెలుస్తుంది. ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకుని, ఈ నెల 25వ తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. అన్ని జట్లకి మింగుడు పడని రాజస్థాన్ రాయల్స్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు తిరిగి కమిన్స్ కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. సన్ రైజర్స్ తదుపరి మ్యాచ్ సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్? ను ఢీ కొట్టనుంది. వెన్నుగాయం కారణంగా కొన్ని రోజుల నుంచి కమిన్స్? ఆటకు దూరంగా ఉంటున్నాడు. సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 9 మ్యాచుల్లో కనీసం 7 మ్యాచులలో నెగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక కమిన్స్ కెప్టెన్ గా తిరిగి రావటం జట్టుకు అదనపు బలంగా మారబోతుంది.



పవర్‌ఫుల్ గ్లామ్ అప్పీల్‌తో రీగల్ లెహంగా లుక్‌లో నుష్రత్ భరుచ్చా స్టన్స్

# రానా దగ్గుపాటి : టాలీవుడ్ హీరోలు టీచర్లు అయితే ఏ సబ్జెక్ట్ చెబుతారో తెలుసా?



టాలీవుడ్ భల్లాలదేవ రానా దగ్గుబాటి అంటే కేవలం నటన మాత్రమే కాదు, తనదైన చమత్కారంతోనూ అందరినీ ఆకట్టుకుంటారు. గతం లో ఒక మూవీ ఫంక్షన్‌లో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు రానా అదిరిపోయే సమాధానాలు ఇచ్చారు. మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఒకవేళ టీచర్లు అయితే ఏ సబ్జెక్టులు బోధిస్తారనే అంశంపై రానా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ సరదా ముచ్చట్లు ఏంటో ఒకసారి చూద్దాం..

**రాజమౌళి - ఆల్ ఇన్ వన్ టీచర్:**

దర్శకధీరుడు రాజమౌళి గురించి రానా చెబుతూ.. ఆయన అన్ని సబ్జెక్టులు నేర్పించగల సమర్థుడని పేర్కొన్నారు. స్కూల్ అయిపోయాక సాయంత్రం వేళ మనం వెళ్లే 'స్పెషల్ ట్యూషన్ టీచర్' లాగా రాజమౌళి గారు ఉంటారని చమత్కరించారు. అంటే ఏ సందేహం వచ్చినా, ఏ విషయంలోనైనా క్లారిటీ ఇవ్వడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా అని రానా ఉద్దేశ్యం. సినిమా అనే స్కూల్‌లో ఆయన ఒక హెడ్ మాస్టర్ లాంటి వారని రానా మాటలను బట్టి అర్థమవుతోంది.

**చరణ్, ప్రభాస్‌ల స్పెషల్ క్లాసులు:**

ఇక రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. చరణ్‌కు గుర్రపు స్వారీ అంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన అందరికీ 'హార్స్ రైడింగ్' నేర్పిస్తే బాగుంటుందని రానా చెప్పారు. అలాగే గ్లోబల్ స్టార్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన బిహేవియరల్ అండ్ కల్చరల్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమిస్తూ, హ్యాపీగా ఎలా ఉండాలో ప్రభాస్ కంటే బాగా ఎవరూ నేర్పించలేరని రానా కొనియాడారు. డార్లింగ్ వ్యక్తిత్వం అలాంటిది మరి.

**అనుష్క మంచితనం.. ఎన్టీఆర్ తెలుగు:**

అనుష్క శెట్టి గురించి రానా చెబుతూ ఒక ఆసక్తికరమైన ఉదాహరణ ఇచ్చారు. జపాన్‌లోని స్కూల్స్‌లో పిల్లలకు మనుషులతో ఎలా మాట్లాడాలి, ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి వంటి లైఫ్ స్కిల్స్ నేర్పిస్తారని, అలాంటి 'మంచితనం' నేర్పించడానికి అనుష్క సరైన వ్యక్తి అని చెప్పారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే, ఆయన 100% పక్కా 'తెలుగు టీచర్' అని రానా తేల్చేశారు. తారక్ మాట్లాడే స్వచ్ఛమైన తెలుగును వింటే ఎవరైనా సరే ఆయనకు ఈ సబ్జెక్ట్ ఇచ్చేయాల్సిందే. ఒక చిన్న రాపిడ్ ఫైర్ రౌండ్‌లో రానా చెప్పిన ఈ విషయాలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి హీరో వ్యక్తిత్వానికి, వారికున్న ఇష్టాలకు అనుగుణంగా రానా సబ్జెక్టులను ఎంచుకున్న తీరు చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. "రానా గారు పక్కాగా గెస్ చేశారు" అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వర్షం కురుస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, తన తోటి నటీనటుల గురించి రానాకు ఉన్న అవగాహన చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ వీడియో మీరు కూడా చూశారా? ముగింపుగా చెప్పాలంటే.. మన స్టార్ హీరోలు ఒకవేళ నిజంగా టీచర్లు అయితే ఆ స్కూల్స్ అన్నీ హౌస్ ఫుల్ అవ్వడం ఖాయం!



హెబ్బా పటేల్ సొగసైన బ్లాక్ లేస్ లుక్‌లో మెరిసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965